Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 202 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 ఆగష్టు 2023 శనివారం పేజీలు : 4

## మణిపూర్‌లో నిరాయుధీకరణ చేపట్టండి

ఇంఫాల్ : మణిపూర్ అంతా హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న తరుణంలో ఆ రాష్ట్ర ఎమ్మెల్యేల్లో 40 మంది ప్రధాని మోదీకి ఓ లేఖ రాశారు. మణిపూర్‌లో వేగంగా శాంతిభద్రతలు నెలకొనేందుకుగానూ పరిపూర్ణ నిరాయుధీకరణ చేపట్టాలని లేఖలో కోరారు. ఎమ్మెల్యేల్లో ఎక్కువమంది మెయితీలున్నారు. కుకీ మిలిటెంట్ గ్రూప్‌లతో సస్పెన్షన్ ఆఫ్ ఆపరేషన్స్ అగ్రిమెంట్ (ఎస్‌వోవో)ను ఉపసంహరించుకోవాలని, ఎన్‌ఆర్సీని అమలు చేయాలని, స్వయంప్రతిపత్తితో కూడిన జిల్లాల కౌన్సిల్స్‌ను బలోపేతం చేయాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. కుకీ గ్రూప్‌ల నుంచి వ్యక్తమవుతున్న 'ప్రత్యేక పరిపాలన' డిమాండ్‌ను తాము వ్యతిరేకిస్తున్నట్లు ఎమ్మెల్యేలు లేఖలో స్పష్టం చేశారు.

# తెలంగాణపై కాంగ్రెస్ ఫుల్ ఫోకస్



## రంగంలోకి సోనియా - తెలంగాణపై సెంటిమెంట్ అస్త్రం..!!

హైదరాబాద్ : తెలంగాణపై కాంగ్రెస్ నాయకత్వం భారీగా ఆశలు పెట్టుకుంది. ఈ సారి అధికారం దక్కించుకోవాలనే లక్ష్యంతో ఉంది. ఇందు కోసం కొత్త వ్యూహాలను సిద్ధం చేస్తోంది. కాంగ్రెస్ అగ్రనాయకత్వం వరుసగా తెలంగాణ లో బహిరంగ సభల్లో పాల్గొనేలా ప్లాన్ సిద్ధమైంది. ఇక, సోనియా గాంధీ రంగంలోకి దిగుతున్నారు. సెంటిమెంట్ అస్త్రాన్ని సంధించేందుకు సిద్ధమయ్యారు.

ఈ మేరకు ముహూర్తం ఖరారు చేసారు. మేనిఫెస్టోకు తుది రూపు ఇస్తున్నారు. సోనియాతో సభ..మేనిఫెస్టో:తెలంగాణ ఎన్నికలు కాంగ్రెస్ కు జీవన్మరణ సమస్యగా మారుతోంది. ఈ సారి ఎన్నికల్లో అధికారం కాంగ్రెస్ లక్ష్యంగా మారింది. పరిస్థితులు తమకు అనుకూలంగా పరిస్థితులు ఉన్నాయని భావిస్తోంది. ఈ సమయంలోనే ఆకర్షణీయ మేనిఫెస్టోతో పాటుగా సెంటిమెట్ అస్త్రాలను సంధించేందుకు సిద్ధమవుతోంది. సెంటిమెంటుతోపాటు ఆకర్షణీయ మేనిఫెస్టోతో తెలంగాణ ప్రజలను ఆకర్శించాలని కాంగ్రెస్ నిర్ణయించింది. ఇందులో భాగంగా, తెలంగాణ ఇచ్చిన పార్టీగా సెంటిమెంట్‌ను మరోసారి తెరపైకి తీసుకు రావడమే కాకుండా ఏకంగా అధినేత్రినే రంగంలోకి దింపాలని భావిస్తోంది. సెప్టెంబరు 17న రాష్ట్రంలో భారీ బహిరంగ సభను ఏర్పాటు చేసి.. దానికి ముఖ్య అతిథిగా సోనియా గాంధీని ఆహ్వానిస్తోంది.

**సెంటిమెంట్ అస్త్రం:** తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఒక్క ఛాన్స్ ఇవ్వాలంటూ ఆమెతో తెలంగాణ ప్రజలకు పిలుపు ఇప్పించనుంది. పార్టీ ఎన్నికల మేనిఫెస్టోనూ ఆ సభలోనే ప్రకటించాలని నిర్ణయించింది. అందులో భాగంగా, తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17న సోనియా సభను ఏర్పాటు చేసి.. ఒక్క చాన్స్ ఇవ్వాలంటూ ఆమెతో పిలుపును ఇప్పించాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయించింది. గడిచిన రెండు ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్ అస్త్రం కేసీఆర్‌కు పని చేస్తే.. ప్రభుత్వం పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకత, సోనియా పిలుపుతో ఆ అస్త్రం ఈసారి కాంగ్రెస్ పార్టీకి వర్కవుట్ అవుతుందని అంచనా వేస్తోంది. ఈ సభలో ఎన్నికల మేనిఫెస్టోనూ ప్రకటించి క్షేత్రస్థాయి నుంచీ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని, పార్టీ మేనిఫెస్టోను ప్రతి గడపకూ చేరుస్తామని పార్టీ వర్గాలు తెలిపాయి.

మూడు భారీ సభలకు ప్లాన్:ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీ, కర్ణాటక సీఎం సిద్దరామయ్యలను ఆహ్వానించి మూడు భారీ సభలను ఏర్పాటు చేయాలని టీపీసీసీ ప్లాన్ చేస్తోంది. సెప్టెంబరు ఏడో తేదీ వరకూ ప్రియాంక గాంధీ షెడ్యూలు ఖాళీ లేకపోవడంతో ఈ లోపునే ఖర్గే, సిద్దరామయ్య సభలను నిర్వహించాలని భావిస్తోంది. ఈనెల 18న తెలంగాణ, కర్ణాటక సరిహద్దు ప్రాంతంలో ఖర్గే సభను నిర్వహించే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. ఈ సభలో కేసీఆర్ ప్రభుత్వంపై చార్జ్‌షీట్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

అలాగే, బీసీ డిక్లరేషన్‌పైనా ప్రస్తుతం కసరత్తు జరుగుతోంది. సెప్టెంబరు 7 తర్వాత ప్రియాంక సభను ఏర్పాటు చేసి అందులో మహిళా డిక్లరేషన్‌ను ప్రకటించాలని నిర్ణయించింది.

# కేసీఆర్ ఒకలా.. కేటీఆర్ మరొకలా!



## కన్ఫ్యూజ్ చేస్తున్నారబ్బా..!

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర సమితిని భారత రాష్ట్ర సమితిగా మార్చి జాతీయ రాజకీయాల్లో చక్రం తిప్పాలని కేసీఆర్ చూస్తున్నారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదాన్ని కూడా ఎత్తుకున్నారు. ఇప్పటికే జాతీయ స్థాయిలో బలంగా ఉన్న వివిధ పార్టీ నేతలనూ కలిశారు. కానీ ఇటీవల జాతీయ రాజకీయాల పరంగా కేసీఆర్ సైలెంట్ అయిపోయారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక మహారాష్ట్రలో బీఆర్ఎస్‌లో చేరికలు తప్ప.. ఇంకో మాట వినిపించడం లేదు. ఇక వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ప్రధాన విపక్ష పార్టీలన్నీ కలిసి ఇండియాగా కూటమి ఏర్పాటు చేసుకున్నాయి. బీజేపీకి వ్యతిరేకమని చెబుతున్న కేసీఆర్.. ఈ కూటమిలో చేరారా? అంటే అదీ లేదు. కేసీఆర్ మౌనం వెనుక ఏదో వ్యూహం ఉందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అయితే కేసీఆర్ చేతలకు తాజాగా ఆయన తనయుడు తెలంగాణ ఐటీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు పొంతన లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెట్రోను నగరం నలువైపులా విస్తరిస్తామని తాజాగా కేటీఆర్ ప్రకటించారు. మెట్రో నిధుల కోసం కేంద్రంలోని బీజేపీని అడుగుతామని.. స్పందించకపోతే వాళ్ల ఖర్మ అని కేటీఆర్ అన్నారు. అయితే 2024లో ఎలాగో సంకీర్ణ ప్రభుత్వం రాబోతుందని, అప్పుడు కేంద్రంలో బీఆర్ఎస్ కీలక పాత్ర పోషించే అవకాశముందని కేటీఆర్ చెప్పడం చర్చనీయాంశంగా మారింది. అప్పుడు నిధులు తెచ్చుకోవచ్చనే అర్థంలో కేటీఆర్ ఈ వ్యాఖ్యలు చేశారు. అయితే కేసీఆర్ ఏమో జాతీయ రాజకీయాల పరంగా సైలెంట్‌గా ఉన్నారు. కేటీఆర్ ఏమో వచ్చే సంకీర్ణ ప్రభుత్వంలో బీఆర్ఎస్‌ది కీలక పాత్ర అంటున్నారు.

పైగా సర్వేలు చూస్తేనేమో ఈ సారి లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ 8 ఎంపీ సీట్లు మాత్రమే గెలుస్తుందని చెబుతున్నాయి. మరి ఈ 8 మంది ఎంపీలతో బీఆర్ఎస్ కేంద్రంలో ఎలా చక్రం తిప్పుతుందో కేటీఆర్‌కే తెలియాలి అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

## ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా..

# తెలంగాణ భాజపా పావులు



హైదరాబాద్: తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ నియోజకవర్గాలపై భాజపా ప్రత్యేక దృష్టి సారించింది. అధికారంలోకి రావాలంటే ఈ నియోజకవర్గాల్లో సింహభాగం గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ఈ నేపథ్యంలో భాజపా రాష్ట్ర కార్యాలయంలో రిజర్వ్ నియోజకవర్గాల నేతలతో.. రాష్ట్ర ఇంఛార్జిలు తరుణ్ చుగ్, సునీల్ బన్సల్, రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్ ఈటల రాజేందర్, డీకే అరుణ, జితేందర్ రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎస్సీ, ఎస్టీ స్థానాల్లో భాజపా విజయం సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై సమాలోచనలు చేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీలకు భాజపా అండగా ఉంటుందనే భరోసా ఈ నియోజకవర్గాల్లో క్షేత్ర స్థాయిలోకి తీసుకెళ్లాలని నేతలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. మధ్యాహ్నం తర్వాత రాష్ట్ర ఎన్నికల ఇంఛార్జి ప్రకాష్ జావడేకర్, సహ ఇంఛార్జి అరవింద్ మీనన్, కేంద్ర మంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి వీరితో సమావేశం కానున్నారు.



# ఈ సారి బిఆర్ఎస్‌లో మైనార్టీలకు ప్రాధాన్యం

## నాలుగైదు టిక్కెట్లు కేటాయించాలని కేసీఆర్ నిర్ణయం!

హైదరాబాద్ : అధికార బీఆర్ఎస్ పరిస్థితి చాలా విచిత్రంగా ఉంటోంది. రాబోయే ఎన్నికల్లో మైనారిటి నేతలకు ఓ నాలుగు టికెట్లు ఇవ్వాలని కేసీయార్ అనుకున్నారట. అందుకని బలమైన నేతల కోసం అన్వేషిస్తున్నారట. విచిత్రం ఏమిటంటే రెండుసార్లు వరుసగా అదికారం లోనే ఉన్నా పార్టీలో చెప్పుకోదగ్గ మైనారిటి లీడర్లు మాత్రం లేరు. పార్టీలో చెప్పుకోదగ్గ మైనారిటి లీడర్ ఎవరంటే మహ్మూద్ ఆలీ మాత్ర మే. మహ్మూద్ ఆలీ ప్రస్తుతం హెంాంశాఖ మంత్రిగా ఉన్నారు.

అలాం టిది మరో నలుగురికి టికెట్లు ఇవ్వాలని కేసీయార్ అనుకున్నా అంత గట్టి నేతలు పార్టీలో లేకపోవటమే విచిత్రం. పార్టీలో ఎందుకు మైనారిటి లీడర్లు దొరకటంలేదు ? ఎందుకంటే మైనారిటీల కోసం మొదటినుండి ఎంఐఎం మీదే ఆధారపడ్డారు కేసీయార్. అందుకనే పార్టీ జనాల నుండి మామూలు జనాలు కూడా బీఆర్ఎస్–ఎంఐఎం వేర్వేరు కాదనే అనుకుంటుంటారు. ఇపుడదే కేసీయార్ కు పెద్ద సమస్యగా మారింది. గడచిన రెండు ఎన్నికల్లో మైనారిటీలకు కేసీయార్ ఇచ్చింది రెండే సీట్లు. ఒకళ్ళేమో మహ్మూద్, రెండే నేతేమో నిజామాబాద్ జిల్లా బోధన్ ఎంఎల్ఏ షకీల్. షకీల్ రెండు సార్లు గెలిచినా పార్టీలో ఎలాంటి ప్రా ధాన్యత లేదు. కారణం మళ్ళీ ఎంఐఎం అనే చెప్పాలి.

రాబోయే ఎన్ని కల్లో ముస్లిం మైనారిటీలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నట్లు కేసీయార్ కు సమాచారం అందిందట. దాంతో అప్రమత్తమైన గులాబీ బాస్ వెంటనే పార్టీలో గట్టి మైనారిటి నేతలు ఎవరున్నారనే విషయాన్ని అన్వేషిస్తున్నారట. ఎందుకంటే కనీసం నాలుగు టికెట్లిస్తే కానీ మైనారిటీ లకు తమ పార్టీ ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పుకునేందుకు లేదన్నది కేసీయార్ బాధ.

ఇంతర్గతంగా మైనారిటీల్లో గట్టినేత దొరకాలంటే ఎక్కడ దొరుకుతారు ? ఉద్యమ పార్టీగా, అధికార పార్టీగా ఉండి మై నారిటీ నేతలను బీఆర్ఎస్ బలోపేతం చేసుకోలేకపోయిందంటే అది కచ్చితంగా కేసీయార్ ఫెయిల్యూర్ అనే చెప్పాలి. ఎంతసేపు ఎన్నికల్లో అప్పటికప్పుడు లబ్ది దొరికితే చాలు అనే తత్వమే కేసీయార్ ను ఇపుడు ఇరుకునపెట్టబోతోంది.

కాంగ్రెస్ లో మైనార్టీ నేతలు చాలామందే ఉన్నారు. సుమారు 15 మంది వరకు గట్టి నేతలున్నారు. అందుకనే హస్తం పార్టీ మైనారిటీల విషయంలో చాలా కూల్ గా ఉంది.

## సంపాదకీయం

# ట్రాఫిక్ తో బెంగళూరు సిటీ నష్టం తేలింది.. హైదరాబాద్ మాటేంటి?

మహానగరాల్ని వేధించే సమస్యల్లో ప్రధానమైనది.. నిత్యం నగర జీవులు ఎదుర్కొనే సమస్యల్లో అత్యంత ముఖ్యమైనది ట్రాఫిక్. దీనితో కోట్లాది పని గంటలు వేస్టు కావటమే కాదు.. వేల కోట్ల నష్టం వాటిల్లుతుందన్న మాట ఉన్నప్పటికీ.. దానిపై అధ్యయనం చేసింది లేదు. తాజాగా ఆ కొరతను తీరుస్తూ.. ట్రాఫిక్ సమస్య కారణంగా జరిగే నష్టం ఎంత ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని కళ్లకు కట్టేలా లెక్కలు బయటకు వచ్చాయి. తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనంలో ట్రాఫిక్ కారణంగా బెంగళూరు మహానగరి నష్టపోతున్నదెంత? అన్నది ప్రశ్నగా మారింది. దీనికి సమాధానం షాకింగ్ గా మారింది. తీవ్రమైన ట్రాఫిక్ సమస్య కారణంగా ఏడాదికి రూ.20వేల కోట్ల మేర బెంగళూరు మహానగరి నష్టపోతున్నట్లుగా లెక్క తేల్చారు. ఏళ్లకు ఏళ్లుగా ట్రాఫిక్ సమస్యతో గార్డెన్ నగరి ఉక్కిరిబిక్కిరి అవుతున్నా.. సొల్యూషన్ మాత్రం లభించని పరిస్థితి. ట్రాఫిక్ జామ్ సమస్య కారణంగా ఎక్కువగా నష్టపోయేది బెంగళూరుకు ఆర్థిక దన్నుగా నిలిచే ఐటీ రంగమేనని తేల్చారు. ఉద్యోగులు తమ విలువైన సమయాన్ని ట్రాఫిక్ తోనే గడుపుతున్నట్లుగా గుర్తించారు. ట్రాఫిక్ సమస్య కారణంగా ఒక్క ఐటీ రంగానికే రూ.7 వేల కోట్ల నష్టం వాటిల్లుతుందని తేల్చారు. నగర ప్రజలు సైతం నాణ్యమైన జీవనాన్ని పొందలేకపోతున్నట్లుగా పేర్కొన్నారు. ప్రజా రవాణ వ్యవస్థను మెరుగుపర్చటం.. కార్ పూలింగ్ లాంటి వాటితో పాటు.. కెమేరాలు.. సెన్సార్ వ్యవస్థల్ని నెలకొల్పి.. ఎక్కువ మంది ట్రాఫిక్ సిబ్బందిని నియమించటం ద్వారా ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. బెంగళూరు నగరం మాదిరే తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొనే హైదరాబాద్ కు జరుగుతున్న డ్యామేజ్ ఎంతన్న విషయంపై అధ్యయనం జరగాల్సిన అవసరం ఉంది.మరి.. మంత్రి కేటీఆర్ ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటే మంచిదని చెప్పక తప్పదు.

# సైబర్ ఎర.. భద్రం జర!



భూపాలపల్లి : జిల్లాలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. అపరిచిత వ్యక్తులు ఒక్క ఫోన్‌కాల్‌తో డబ్బులు కొల్లగొడుతున్నారు. బాధితుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. తీరా మోసపోయామని తెలిసేసరికి బ్యాంకులో నగదంతా ఖాళీ అవుతోంది. బ్యాంకు ఖాతాల్లో కేవైసీ అప్‌డేట్‌ల పేరుతో నకిలీ యాప్‌లు, ఉద్యోగాల ప్రకటనలు, ఆర్థిక సహాయాలు, లింకులు పంపిస్తూ అనేక రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. వీరి వలలో పడి అమాయక ప్రజలతో పాటు మహిళలు, విద్యావంతులు సైతం చేతులు కాల్చుకుంటున్నారు. సకాలంలో ఫిర్యాదులు చేస్తే కొంతవరకు న్యాయం జరుగుతున్నా.. ఆలస్యంగా స్పందించే వారికి విషయం చేయి దాటిపోతోంది. భూపాలపల్లి పట్టణానికి చెందిన ఓ మహిళ ఈ నెల 13న ఆన్‌లైన్‌లో ఓ లింక్‌ను ఓపెన్ చేసి చీరలను చూసింది. వెంటనే ఫోన్‌కు ఓ సందేశం వచ్చింది. క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే అవకాశం కల్పించామని, ఓటీపీ నంబరు తెలపాలని అపరిచిత వ్యక్తి సూచించారు. ఆ విధంగానే ఆమె తెలియజేశారు. వెంటనే అకౌంట్లో నుంచి రూ.57 వేలు డ్రా అయిపోయాయి. అకౌంట్ బ్యాలెన్సు చూసుకోగా ఖాళీ అయినట్లు గుర్తించి వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూపాలపల్లి ప్రధాన రోడ్డులో మైసమ్మ ఆలయం దగ్గర్లో ఉండే ఓ మహిళకు అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. మీ పేరిట పాస్‌పోర్టు కార్డులు నాలుగైదు జారీ అయి ఉన్నాయి.. మీకు పెద్ద సమస్య కాబోతోంది.. ఇబ్బందుల్లో ఇరుక్కుంటారని బెదిరించాడు.. వాటన్నింటినీ రద్దు చేయాలంటే మీ గూగుల్ పే అకౌంట్ నుంచి ఒక నంబర్ కొట్టాలని సూచించాడు. ఆ మహిళ అలాగే చేయడంతో రూ.95,499 డ్రా అయిపోయాయి. ఫోన్‌కు డబ్బులు డ్రా అయినట్లు సందేశం రావడంతో వెంటనే ఆ వ్యక్తికి ఫోన్ చేయగా నంబర్ స్విచ్ ఆఫ్ అయిపోయింది. లబోదిబోమంటూ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

**చరవాణినే కీలకం..**

ఇటీవల సెల్‌ఫోన్ నంబరుకే అన్ని లింకై ఉండటంతో.. దీనిపైనే ఎక్కువగా నేరగాళ్లు దృష్టి సారించారు. మెసేజ్‌లు, షాపింగ్, గిఫ్టుల పేరిట ఏదో ఒక రకంగా నంబరును సేకరిస్తూ దానికున్న యూపీఐ ఐడీని తెలుసుకోవడానికి అనేక రకాల లింకులు సృష్టిస్తున్నారు. తెలిసీ తెలియక లింకు క్లిక్ చేస్తే చాలు వెంటనే బ్యాంకు ఖాతాల్లోంచి సొమ్ము మాయమవుతోంది. ఆధార్‌తోపాటు బ్యాంకు ఖాతాలు, భూముల వివరాలు, ఉద్యోగ సమాచారం.. ఏదైనా సెల్‌ఫోన్ నంబరుతోనే లింకై ఉండటంతో సైబర్ నేరగాళ్లకు మోసం చేయడం సులువవుతోంది.

**బాధితులు ఇలా స్పందించాలి**

సైబర్ క్రైం పోలీసుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసేలోపే నేరగాళ్లు డబ్బును ఖాతాల నుంచి లాగేసుంటారు. ఇలాంటి మోసాలను ఆపి నేరగాళ్ల ఖాతాలను స్తంభింపచేసేలా కేంద్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను రూపొందించింది. ఖాతాల నుంచి డబ్బు పోయినట్లు గుర్తించగానే వెంటనే కేంద్ర హోం శాఖ హెల్ప్‌లైన్ నంబరు 1930కి ఫోన్ చేయాలి. లేదా 100కు కాల్ చేయాలి. పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే నేరగాళ్ల ఖాతాను నిలిపివేసి.. తిరిగి బాధితుని ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి.. చరవాణులకు వచ్చిన ఓటీపీ, ఇతర బ్యాంకు ఖాతాల వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తులకు చెప్పొద్దు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి అడిగినా ఏమీ తెలపొద్దు.. వైఫైల ద్వారా నగదు లావాదేవీలు జరపకూడదు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే సంక్షిప్త సందేశాలను ఓపెన్ చేయకూడదు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని ఉంటే దాని జోలికి వెళ్లవద్దు.ఎక్కువ శాతం ఎస్బీఐ యోనో, కేవైసీ, పాన్‌కార్డు పేరుతో ఎక్కువగా మోసాలు జరిగే అవకాశం ఉంది. వీటి విషయంలో ఎవరికీ తమ సమాచారాన్ని షేర్ చేయవద్దు. డెబిట్ కార్డు, చరవాణి హ్యాక్ అయిందన్న అనుమానం రాగానే వెంటనే అంతర్జాల ఆధారిత కొనుగోళ్లు నిలిపివేయాలి. వ్యక్తిగత రుణాలు, ఉద్యోగాలు కల్పిస్తామనే ఫోన్లు, లింకులకు స్పందించొద్దు.

**అప్రమత్తంగా ఉండాలి.. సురేందర్‌రెడ్డి, ఎస్పీ, భూపాలపల్లి**

మొబైల్ వాడకంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వాటిని నియంత్రించాలంటే అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా, అనుమానం ఉన్న నంబర్లకు ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దు. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. లింకులు ఓపెన్ చేయవద్దు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతాకు సంబంధించిన వివరాలు తెలపాలని అడుగుతారు. వివరాలు చెప్పకూడదు. ఒకవేళ మోసపోతే తక్షణమే పోలీసులను సంప్రదించాలి. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులపై నిఘా ఉంచాం.

# అదే తీరు.. మారని అధికారులు..!

భూపాలపల్లి : ఐటీడీఏ అధికారుల కక్కుర్తి అడవి బిడ్డల సంస్థను అబాసుపాలు చేస్తోంది. అమాయక బిడ్డల రక్తాన్ని సొమ్ము చేసుకోవడమే గిరిజనాభివృద్ధి సంస్థ అధికారులకు అలవాటుగా మారింది. గిరిజనుల సమగ్రాభివృద్ధికి అంకిత భావంతో పని చేయాల్సిన అధికారులు ముడుపులకు కక్కుర్తి పడుతున్నారు. తాజా సంఘటన అధికారుల లంచావతారానికి నిదర్శనం. ఏటూరునాగారం ఐటీడీఏ గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేసే డీఈఈ నవీన్, ఏఈఈ ఆబీద్‌ఖాన్‌లను బాధితులు అనిశాకు పట్టించారు. రూ.90 వేలు డిమాండ్ చేసి, రూ.50 వేలు లంచం తీసుకుంటూ అనిశాకు చిక్కారు. డీఈఈ నవీన్ అత్యాశకు పోయి తన భవిష్యత్తును నాశనం చేసుకున్నాడు. ఐటీడీఏలో అధికారులు ప్రతి పనిలో జాప్యం చేస్తున్నారు. ఈ వైఖరి అడవి బిడ్డలను ఆగ్రహానికి గురి చేస్తోంది. ఏడాది కాలంగా లంచం కోసం జాప్యం చేసినందుకు ఇంజినీర్లను అడవి బిడ్డలు అనిశాకు పట్టించారు. ఇదే పరిస్థితి అన్ని ఐటీడీఏలోని అన్ని విభాగాల్లో నెలకొంది.

**అధికారులే గుత్తేదారులుగా?**

గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగంలో అధికారులే గుత్తేదారులుగా మారుతున్నారు. అవసరం రీత్యా పనులు తొందరగా పూర్తి చేయాలనే సాకుతో డిపార్ట్‌మెంటల్ ఎగ్జిక్యూషన్ పేరుతో బినామీలను ఏర్పాటు చేసుకుని వారితో అభివృద్ధి పనులు చేయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పర్యవేక్షించాల్సిన వారే పనులు చేయిస్తే నాణ్యత ఎలా ఉంటుందో ఊహించొచ్చు. ఎక్కువ డబ్బులు మిగిలే పనులను పరిశీలించి సంబంధిత పనుల ప్రతిపాదనలు పంపిస్తారనే ఆరోపణలున్నాయి. అవసరమున్న పనులు ప్రతిపాదించాలని కోరితే అలాంటి వాటిని పట్టించుకోరని గిరిజనులు చెబుతున్నారు. ఏటూరునాగారంలో ఐటీడీఏ ఎదురుగానే ఉన్న కస్తూర్బా విద్యాలయం లో భవనాలు సరిగా లేవని సంబంధిత సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పలుమార్లు కోరినా ఇంతవరకు పట్టించుకోవడం లేదు.

**దస్త్రం కదలాలంటే..**

అధికారి నుంచి మొదలు ఉద్యోగి వరకు ఫైలు కదలాలంటే పైసలివ్వడం ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగంలో పరిపాటిగా మారింది. ఇంజినీరింగ్ పరిపాలన విభాగంలో డ్రాయింగ్ బ్రాంచిలో టెక్నికల్ అధికారులు, సిబ్బంది, అకౌంట్స్ బ్రాంచి విభాగంలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు ఇలా అన్ని సెక్షన్లలోనూ ముడుపులు ముట్టజెప్పకుంటే దస్త్రాలు కదలవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి ఒక గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ విభాగంలోనే కాకుండా ఐటీడీఏలోని అన్ని విభాగాల్లో సైతం నెలకొందని గిరిజనులు చెబుతున్నారు.

ఇవీ ఆధారాలు.. రూ.కోటితో చేపట్టిన గిరిజన భవనాల పనులు ఐదేళ్ల పాటు కొనసాగి ఇటీవలే పూర్తయ్యాయి. 2015-16 ఆర్థిక సంవత్సరంలో రూ.4.5 కోట్లతో నిర్మించిన దొడ్ల వారధి ఐదేళ్లకే కుంగి కూలిపోయే దశకు చేరుకుంది. ఆర్థిక స్వావలంబన పథకం కింద ఓ మహిళ 2015-16 ఆర్థిక సంవత్సరంలో హార్వెస్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆమెకు యునిట్ మంజూరైనా ఇంతవరకు ఇవ్వలేదు.

ఇందిరా జలప్రభ, ప్రస్తుత గిరి వికాసం పథకాల కింద పోడు భూముల్లో వేసిన బోర్లకు విద్యుదీకరణ, మోటార్లు బిగించడం, విద్యుత్తు లైన్లు వేయడం తదితరాల కోసం ఏళ్ల తరబడి గిరిజనులు ఐటీడీఏ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. సెక్షన్లలో దస్త్రాలు ఏళ్లపాటు ఉంటున్నా ఆయా సెక్షన్లలో పని చేసే అధికారులు, ఉద్యోగులు మాత్రం పనులు పూర్తి చేయడం లేదు. అధికారులు, ఉద్యోగులకు చేతులు తడిపితేనే పనులు జరుగుతాయన్న భావన గిరిజనుల్లో నెలకొంది.

# నజరానా అందని ద్రాక్షేనా..!

ఆత్మకూర్ : తెలంగాణలోని పల్లెసీమలను దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ఐదు వందల జనాభా కలిగి ఉన్న అన్ని ఆవాస ప్రాంతాలను, గిరిజన తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. వీటన్నింటికి 2019 జనవరిలో మూడుదశల్లో ఎన్నికలు నిర్వహించింది. ఏకగ్రీవ పంచాయతీకి రూ.10 లక్షల నజరానా అందజేస్తామని ఎన్నికల ముందు ప్రభుత్వం ప్రకటించడంతో అనేక గ్రామ పంచాయతీలు ఏకగ్రీవాల వైపు అడుగులు వేశాయి. కొన్ని గ్రామ పంచాయతీలను ప్రజలందరూ కలిసి ఏకతాటిపైకి వచ్చి ఏకగ్రీవం చేసుకున్నారు. ఎన్నిక ప్రక్రియ ముగిసి రెండు సంవత్సరాలు పూర్తయినా వారు ఆశించిన ప్రోత్సాహకాలు అందలేదు.

**అందాల్సినవి రూ.23.70 కోట్లు**

2019 జనవరి నెలలో మూడు విడతల్లో ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 1733 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించారు. నల్లగొండ జిల్లాలోని 837 పంచాయతీలకు గాను 120, సూర్యాపేట జిల్లాలో 475కి 54, యాదాద్రి భువనగిరి జిల్లాలోని 421కి 63 పంచాయతీల్లో పాలకవర్గాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రోత్సాహకం ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల చొప్పున ఉమ్మడి నల్గొండ జిల్లాకు అందాల్సిన నజరానా రూ.23.70 కోట్లు. నల్గొండ జిల్లాకు రూ.12 కోట్లు, సూర్యాపేట జిల్లాకు రూ.5.40 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాకు రూ.6.30 కోట్లు ప్రభుత్వం నిధులు విడుదల చేయాల్సి ఉంది. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గ పరిధిలో ఏకగ్రీవ పంచాయతీలకు ఏర్పాటు చేసుకుంటే




నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి ఒక్కో ఏకగ్రీవ పంచాయతీకి రూ.10లక్షలు ప్రోత్సాహక నిధులు అందజేస్తామని ప్రకటించారు. ఈ లెక్కన ఉమ్మడి జిల్లాలో ఏకగ్రీవ పంచాయతీలకు అందాల్సిన నిధులు రూ.50 కోట్లకు పైగానే ఉంటుంది.

**అభివృద్ధికి సహకరించాలి- పెసరు గిరిజ, సర్పంచి పుల్లాయిగూడెం**

ఏకగ్రీవ పంచాయతీల ప్రోత్సాహక నిధులకు రెండు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్నాం. ఇప్పటి వరకు మంజూరు చేయలేదు.అధికారులకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు అందకపోవడం, పైగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు తమ నిధులు సైతం కేటాయించ లేదు. విడుదల చేసి అభివృద్ధికి సహకరించాలి.

**సమాచారం లేదు-టి.సాయిబాబా డీపీవో, యాదాద్రి భువనగిరి జిల్లా**

ఏకగ్రీవ పంచాయతీలకు ఎన్నికల సమయంలో ప్రభుత్వం ప్రకటించిన నజరానా నిధులపై మాకు ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదు. ప్రభుత్వం మంజూరు చేస్తే ఏకగ్రీవ పంచాయతీలకు అందజేస్తాం.

# రోగులు వస్తున్నారు.. సదుపాయాలు కల్పించండి

ఖమ్మం : నరాల సంబంధ సమస్యతో రెండు కాళ్లు పడిపోయిన ఓ రోగి కదల్లేని స్థితిలో జిల్లా ఆస్పత్రిలోని న్యూరో విభాగం వైద్యుల్ని సంప్రదించారు. అతనికి హైదరాబాద్ స్థాయిలో చికిత్సకు అవకాశం ఉన్న జీబీ సిండ్రోమ్ సమస్యకు ఇక్కడే వైద్యాన్ని అందించారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా 24 ఇంజక్షన్లు ఇవ్వడంతో వారం రోజుల్లోనే రోగి సాధారణ స్థితికి చేరుకున్నారు. ఇలాంటి ఖరీదైన వైద్యాన్ని ఖమ్మం సర్కారు దవాఖానాలో అందించారు.మహబూబాబాద్ జిల్లా ఉప్పెరగూడేనికి చెందిన శ్రీకాంత్ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యారు. తల నుదుటి ఎముకలు విరిగి మెదడులోకి చొచ్చుకెళ్లడంతో అచేతన స్థితికి చేరారు. ఖమ్మం ప్రభుత్వ వైద్యులు అతనికి డీకంప్రెసివ్ కానియెక్టమీ ఎవాక్యువేషన్ చికిత్స అందించారు. విరిగిపోయిన ఎముకల స్థానంలో కృత్రిమ ఎముకలు అమర్చారు. శస్త్ర చికిత్స జరిగిన తొమ్మిది రోజుల్లోనే రోగి పూర్తిగా కోలుకొని ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడ్డాడు.

ఖమ్మం జిల్లా ఆస్పత్రిలోని న్యూరో(నరాల) విభాగానికి రోగులు పోటెత్తుతున్నారు. 2021, జూన్‌లో ప్రారంభమైన ఈ విభాగంలో పలు రకాల నరాల సమస్యలు, ప్రమాద బాధితులకు చికిత్స అందిస్తున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాలతోపాటు పరిసర ప్రాంతాలకు చెందిన



వందల మంది రోగులు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. అనేక అత్యవసర కేసులకు వైద్యులు పరిష్కారం చూపుతున్నారు. ఈ పరిస్థితుల్లో అన్ని రకాల సదుపాయాలు, పరికరాలు అందుబాటులో లేకపోవడంతో కొన్ని కేసులను హైదరాబాదుకు రిఫర్ చేస్తున్నారు. ఖరీదైన న్యూరో ప్రత్యేక సేవలను ప్రవేశపెట్టినా పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులను సమకూరిస్తే అన్ని రకాల కేసులకు ఇక్కడ వైద్యం లభించే అవకాశం ఉంది. ప్రస్తుతం 10 పడకలతో ఐసీయూ అందుబాటులో ఉంది. దీన్ని మరింత విస్తరించాల్సి ఉంది. ఎలాంటి కేసులున్యూరో విభాగాన్ని బ్రెయిన్ క్యాన్సర్, వెన్నుపూస సమస్య, పక్షవాతం, మెదడులో రక్తం గడ్డకట్టడం, ట్యూమర్, సర్వైకల్ వంటి అనేక రకాల జబ్బులతో బాధపడుతున్న వారు సంప్రదిస్తున్నారు. ప్రతి నెలా దాదాపు 30-40 క్లిష్టతర కేసులు నమోదవుతున్నాయి. కానీ ఓపీ, ఐపీ విభాగాల్లో వైద్యుల సంఖ్య తగిన స్థాయిలో లేదు. ప్రస్తుతం ఒప్పంద పద్ధతిలో ఒక్కొక్కరే శస్త్ర చికిత్స నిపుణులు, మత్తు వైద్య నిపుణులు పనిచేస్తున్నారు. అవకాశం ఉన్న మేరకు వైద్యం అందిస్తున్నా అనేక కేసులను రాజధానికి తరలించాల్సిన పరిస్థితి. ముఖ్యంగా శస్త్ర చికిత్స విభాగాన్ని తక్షణం అందుబాటులోకి తేవాల్సిన అవసరం ఉంది. ముఖ్య పరికరాలు లేకపోవడంతో సంబంధిత చికిత్సలు చేయడం సాధ్యం కావటం లేదు.

# కిస్తీలు కట్టేందుకు కుస్తీలు

ఇల్లెందు : ఉభయ జిల్లాల్లో మహిళలను ఆర్థికంగా పరిపుష్టం చేసేందుకు, రైతులకు సాగులో సాయపడేందుకు సెర్ప్, మెప్మా ఆధ్వర్యంలో మండల మహిళా సమాఖ్యలతో 2021లో వ్యవసాయ అద్దె యంత్రాల కేంద్రాలు ప్రారంభించారు. చాలాచోట్ల ఆదరణ లేకపోవటంతో నిర్వహణాపరమైన ఇబ్బందులు ఎదురవుతున్నాయి.వ్యవసాయ అద్దె యంత్రాల కేంద్రాల ఏర్పాటుకు పలుచోట్ల ఎంఎంఎస్‌లకు స్త్రీనిధి ద్వారా, మరికొన్ని మండలాల్లో జీవనోపాధుల పథకం ద్వారా రుణాలు ఇచ్చారు. భద్రాద్రి జిల్లా టేకులపల్లి, ములకలపల్లి, పినపాక, మణుగూరు, ఖమ్మం జిల్లా కొణిజర్ల, కూసుమంచి, రఘునాథపాలెం, వేంసూరు మండలాల్లో కస్టమర్ అగ్రికల్చర్ హైరింగ్ కేంద్రాల(సీహెచ్‌సీ)ను 18 నెలల క్రితం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు.

ఏమేం ఉంటాయి?అందిన రుణంతో రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు కొనుగోలు చేశారు. ప్రతి మండలంలో ఓ ట్రాక్టర్, ట్రాలీ, మేజ్‌సెల్లర్, కల్టివేటర్, ప్లవ్, రొటోవేటర్, స్ప్రేయర్లు, దమ్ము చక్రాలను అందుబాటులో ఉంచారు. వీటిని వినియోగించుకున్నందుకు చెల్లించాల్సిన అద్దె రేట్లను మండల మహిళా సమాఖ్యలు నిర్ణయించా



యి. సమాఖ్యలు సంబంధిత బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలకు 10.5 శాతం వడ్డీ కలిపి మొత్తం 60 నెలలపాటు కిస్తీలు చెల్లించాల్సి ఉంటుంది. నవంబరు నాటికి కూసుమంచి మండలంలో రూ.1.97 లక్షలు, రఘునాథపాలెం రూ.2.44 లక్షలు, వేంసూరు రూ.3.44 లక్షలు, భద్రాద్రి జిల్లాలోని మణుగూరు రూ.98 వేలు, పినపాక రూ.22 వేలు, టేకులపల్లి రూ.55 వేల ఓవర్ డ్యూలున్నాయి. టేకులపల్లి మండలంలో సీహెచ్‌సీ సెంటర్‌కు 18 నెలల్లో వచ్చిన ఆదాయం రూ.4.85 లక్షలు కాగా, ఎంఎంఎస్ సభ్యులు కిస్తీలుగా చెల్లించిన మొత్తం రూ.6.37 లక్షలు. ఓవర్ డ్యూలు లేకుండా ఉండేందుకు ఎంఎంఎస్ నిల్వ నగదు నుంచి కిస్తీలు చెల్లించడం గమనార్హం. ప్రతి మండలంలో ఇదే తరహాలో పరిస్థితులున్నాయి.

**విముఖత ఎందుకంటే..**

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువమంది రైతులకు సాగు సమయంలో చేతిలో డబ్బులుండవు. స్థానికంగా ట్రాక్టర్ల కిరాయిలు పంటలు చేతికందిన తర్వాత చెల్లించేలా ఒప్పందాలు ఉంటాయి. కానీ సీహెచ్‌సీల్లో వెంటనే డబ్బులు చెల్లించాల్సి రావటం, డ్రైవర్‌ను కూడా రైతే సమకూర్చుకోవడం, ధ్రువపత్రాల సమర్పణ వంటివి ప్రతికూలాంశాలుగా మారాయి. డీజిల్ ధరల్లో హెచ్చు తగ్గులను అనుసరించి రేట్లు కూడా మారుతుండటంతో అన్నదాతలు వీటిపై విముఖత చూపుతున్నారు.

# బీసీ కుల వృత్తిదారులకు శుభవార్త

హుజూరాబాద్:ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసుకున్న బీసీ కుల వృత్తిదారులకు శుభవార్త. జిల్లాకు రూ.12 కోట్ల నిధులు విడుదల చేసింది. ఇప్పటి వరకు ఎదురుచూపుల్లో ఉన్న వేలాది మందిలో ఆశలు చిగురించాయి. మరో వైపు ఇప్పటికే పలువురు బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంతోపాటు ఎమ్మెల్యేలు, సంఘాల నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. పంపిణీ చేయడానికి అధికారులు చర్యలు ముమ్మరం చేశారు.

52 మందికి పంపిణీ

బీసీ కులవృత్తుల వారికి రూ.లక్ష ఆర్థిక సాయం ప్రభుత్వం ప్రకటించిన అనంతరం జిల్లా వ్యాప్తంగా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకున్నారు. జూన్ 9న ప్రయోగాత్మకంగా కొందరికి, గత నెల 15న మరికొందరికి మొత్తం 52 మందికి చెక్కులు అందజేశారు. గత నెలలో నియోజ వర్గానికి 300 మందిని ఎంపిక చేసి ఈ సాయం అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా.. నిధులు రాకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో అర్హుల జాబితా సిద్ధం కాకపోవడం వంటివి ప్రతిబంధకంగా మారాయి. మరో వైపు పలు సంఘాలు, పలువురు నాయకులు తమ వారికి ఈ సాయాన్ని అందించేలా ఎవరికి వారే పావులు కదుపుతున్నారు.

నియోజకవర్గానికి రూ.3 కోట్లు

రూ.లక్ష ఆర్థిక సాయం అందించేందుకు జిల్లాలోని ప్రతి నియోజకవర్గానికి 300 మందికి అవసరమైన రూ.3 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు పరిశీలన చేసి తుది పరిశీలనకు పాలనాధికారికి, జిల్లా మంత్రికి అందజేశారు. కరీంనగర్, హుజూరాబాద్ పూర్తి నియోజకవర్గాలతో పాటు జిల్లా పరిధిలోకి వచ్చే హుస్నాబాద్, చొప్పదండి, మానకొండూర్ నియోజకవర్గాలకు చెందిన అర్హుల జాబితాలను అధికారులు సిద్ధం చేశారు. బుధవారం కరీంనగర్‌లో జిల్లా మంత్రి కమలాకర్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం పంపిణీ, అర్హుల ఎంపికపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. అనంతరం ఒకటి, రెండు రోజుల్లో అర్హులకు ఆర్థిక సాయం అందించనున్నారు.

ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా..

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బీసీ కులవృత్తుల అర్హులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేస్తాం. ఇప్పటికే నిధులు విడుదల చేసింది. అర్హుల జాబితాలను సంబంధిత అధికారులు రూపొందించారు. ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో త్వరలో చెక్కులు పంపిణీ చేస్తాం.

# నిబంధన లే అవుట్

పెద్దపల్లి : 'భవనాలు, ఖాళీ స్థలాలు కొనుగోలు చేయాలనుకుంటున్నారా.. అయితే వర్షాకాలంలోనే కొనేయండి.. ఎందుకంటే ఏ ప్రాంతం లోతట్టులో ఉందో.. ఏ కాలనీ చెరువుగా మారుతుందో.. తెలిసేది ఇప్పుడే..' అంటూ ఓ సందేశం ఇటీవలి వర్షాల సమయంలో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. దీనికి నెటిజన్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. అనధికార లే అవుట్లకు ఈ సందేశం అద్దం పడుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో డీటీసీపీ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్) గుర్తింపు ఉన్న లేఅవుట్లు పదుల సంఖ్యలో ఉంటే అనధికారిక లేఅవుట్లు వేల సంఖ్యలో ఉంటున్నాయి. ఖాళీ స్థలం కనబడితే చాలు ప్లాట్లుగా మార్చి విక్రయిస్తుండటంతో వరదల వేళ చెరువులను తలపిస్తున్నాయి.

నోటీసులు ఇచ్చి చేతులెత్తేస్తున్నారు

కొత్త పురపాలక చట్టం అమలులోకి వచ్చినా అక్రమ లే అవుట్లు యథేచ్ఛగా ఏర్పాటవుతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 560 కంటే ఎక్కువగా అనధికార అక్రమ లే అవుట్ల యజమానులకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు కేవలం నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. అధికారులు వచ్చి హద్దులు తొలగిస్తే, అనంతరం యజమానులు వచ్చి తిరిగి ఏర్పాటు చేసుకుంటున్నారు.

నిబంధనల మేరకు లే అవుట్లలో 10 శాతం ఖాళీ స్థలాన్ని స్థానిక సంస్థల పేరిట రిజిస్ట్రేషన్ చేయించకుంటే సదరు డెవలపర్ నుంచి భారీగా జరిమానా వసూలు చేయాలని కలెక్టర్లు సూచించినా అమలుకు నోచుకోవడం లేదు. మున్సిపాలిటీ పేరిట ఈ ఖాళీ స్థలంలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని చెప్పినా ఫలితం లేకుండా పోయింది. మాస్టర్ ప్లాన్‌లో రెసిడెన్షియల్ జోన్‌లో ఉండే ఖాళీ స్థలానికి నిబంధనల ప్రకారం భవన నిర్మాణ అనుమతులు ఇచ్చే అవకాశాలున్నాయని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చెబుతున్నారు. క్రమబద్ధీకరణ రుసుముతో పాటు మొత్తం స్థలం మార్కెట్ విలువపై 14 శాతం ఓపెన్ స్పేస్ రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. అదనంగా స్థలం మార్కెట్ విలువలో 33 శాతం డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన అనధికారిక, అక్రమ



లేఅవుట్లపై ప్రభుత్వం కొరడా ఝుళిపించేందుకు సిద్ధమైనప్పటికీ పాలకవర్గాలు, అధికారులు మామూళ్ల మత్తులో చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

పట్టణ ప్రగతి నిర్వహణ సమయంలో అనధికారిక ప్లాట్లను గుర్తించి తొలగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది.

ఆరోపణలు నిజమనిపించేలా..

అక్రమ లేఅవుట్ల ఏర్పాటులో పట్టణ ప్రణాళిక అధికారులు పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు గతంలో వినిపించాయి. పట్టణ శివారు ప్రాంతాల్లో వెలిసిన నిర్మాణాలకు డీటీసీపీ అనుమతులు లేవు. ఇష్టారాజ్యంగా ప్లాట్లు చేసి విక్రయిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. స్థిరాస్తి వ్యాపారులు చెరువులు, కుంటలను ఆక్రమించి లే అవుట్లు వేశారు. అధికారులు స్థానిక సంస్థల్లో తక్కువ సంఖ్యలో లేఅవుట్లు ఉన్నట్లు చూపడం.. లేఅవుట్ల వివరాలు అడిగితే సమాచారం ఇవ్వకపోవడం.. దాటేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# రేషన్ డీలర్లకు తీపి కబురు



హుజూరాబాద్: రేషన్ డీలర్లకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. వారికిచ్చే కమీషన్‌ను పెంచుతూ నిర్ణయం తీసుకుంది. దీంతో అయిదారేళ్లుగా ఎదురుచూస్తున్న డీలర్ల నిరీక్షణకు ఫలితం దక్కినట్లయింది. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ తదితరులు రేషన్ డీలర్ల సంఘాల ఐకాస ప్రతినిధులతో చర్చలు జరిపారు. రేషన్ డీలర్లకు ప్రస్తుతం క్వింటాకు రూ.70 చొప్పున కమీషన్ ఇస్తుండగా దీన్ని రెట్టింపు చేసి రూ.140కి పెంచారు.

ఫలించిన నిరీక్షణ

ఉమ్మడి జిల్లాలో 1,965 మంది రేషన్ డీలర్లుండగా ప్రతినెలా 18,275.335 మెట్రిక్ టన్నుల బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్నారు. ఇందుకుగానూ క్వింటాకు రూ.70 చొప్పున 1,27,92,734.50 చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి డీలర్లకు కమీషన్ చెల్లిస్తున్నాయి. కాగా తమకిచ్చే కమీషన్ సరిపోవడం లేదని, ఇంటి అద్దె, హమాలీ ఛార్జీలు, ఇంటర్నెట్ రీచార్జి, కరెంటు బిల్లుతో సహా ప్రతినెలా రూ.5 వేలకు పైగానే ఖర్చవుతుందని, ఈ భారం తాము మోయలేకపోతున్నామని డీలర్లు చెబుతూ వచ్చారు. క్వింటాకు కమీషన్‌ను రూ.200 నుంచి రూ.250 వరకు పెంచాలని, లేదంటే నెలకు రూ.30 వేల చొప్పున గౌరవ వేతనం చెల్లించాలంటూ డిమాండ్ చేస్తూ వచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా అనేకసార్లు ఆందోళనకు దిగడం, పలు దఫాలుగా డీలర్లతో ప్రభుత్వం చర్చలు జరిపినా ఫలించలేదు. ఈ మేరకు గత జూన్‌లో సమ్మెకు పిలుపునివ్వగా డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావడంతో విరమించారు. తాజాగా మంగళవారం మంత్రులు హరీశ్‌రావు, గంగుల కమలాకర్ డీలర్ల సంఘం ప్రతినిధులతో జరిపిన చర్చల్లో గౌరవ వేతనం ఇవ్వడం కుదరదని, దానికి బదులుగా కమీషన్‌ను రెండింతలు పెంచి క్వింటాకు రూ.140 చొప్పున చెల్లించేలా నిర్ణయం తీసుకున్నారు. ఇకనుంచి ఉమ్మడి జిల్లాలోని రేషన్ డీలర్లకు ప్రతినెలా రూ.2,55,85,469 కమీషన్ అందనుంది. రేషన్ డీలర్లందరికీ హెల్త్‌కార్డులు ఇచ్చేలా ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే రేషన్ డీలర్ల కారుణ్య నియామకాలపై కూడా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. డీలర్ల కారుణ్య నియామకాల గరిష్ఠ వయోపరిమితిని 50 ఏళ్లకు(ఇప్పటి వరకు 40 ఏళ్లుగా ఉంది) పెంచుతూ గత జూన్ 16న పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ నియామకాలపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. దీనిపై కూడా మంత్రులు సానుకూలంగా స్పందించి కరోనాతో చనిపోయిన డీలర్ల స్థానంలో వారి కుటుంబ సభ్యులను నియమించేలా నిర్ణయం తీసుకున్నారు. ప్రతినెలా ఇచ్చే బియ్యం కోటాలో తరుగు పేరిట కోత పెడుతున్నారని, 50 కిలో సంచికి అయిదారు కిలోలు తక్కువ ఇస్తుండటంతో తాము నష్టపోతున్నామని డీలర్లు చెబుతూ వచ్చిన విషయం తెలిసిందే. గత జూన్ నుంచి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాముల్లో బయోమెట్రిక్ ద్వారా బియ్యం కేటాయిస్తుండటంతో తరుగుకు కళ్లెం పడింది.

మూడు నెలలుగా అందని కమీషన్

లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేసినా డీలర్లకు మాత్రం మూడు నెలలుగా కమీషన్ సొమ్ము అందలేదు. దీంతో రేషన్ దుకాణాల నిర్వహణ, అద్దె, హమాలీ, ఇతర ఖర్చుల భారం పడుతుందని డీలర్లు వాపోతున్నారు. ఉమ్మడి జిల్లాలోని 1,965 మంది రేషన్ డీలర్లు గత మూడు నెలలుగా 54,826 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఇందుకుగానూ క్వింటాకు రూ.70 చొప్పున రూ.3.84 కోట్ల కమీషన్ చెల్లించాల్సి ఉంది. గతేడాది నవంబర్ నెల వరకు జిల్లా పౌరసరఫరాల శాఖ నుంచే డీలర్లకు కమీషన్ అందినప్పటికీ డిసెంబర్ నుంచి కమిషనర్ కార్యాలయం నుంచే అందేలా ఏర్పాట్లు చేయడంతో ఆలస్యమవుతోందని అధికారులు చెబుతున్నారు.

# సిబ్బంది కొరత.. వినియోగదారుల వెత



హుజూరాబాద్: విద్యుత్తు.. వినియోగదారులకు ఎల్లవేళలా అవసరమవుతోంది. ఒకప్పటితో పోల్చితే కరెంటు సేవలు బాగానే అందుతున్నా.. చిన్న చిన్న లోపాలు ఇబ్బందికి గురి చేస్తున్నాయి. కనెక్షన్ల పెరుగుదలకు తోడు నిర్మాణ పరమైన అంశాలు వృద్ధి చెందుతున్నా.. మానవ వనరులు మాత్రం పెరగడంలేదు. సిబ్బంది కొరతతో క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులపై కథనం.

కొత్త సెక్షన్‌కు సిఫార్సు

నగర శివారులోని వెస్ట్ సెక్షన్ పరిధిలో చింతకుంట, అసిఫ్‌నగర్, కాజీపూర్, బద్దిపల్లి, కమాన్‌పూర్, ఎలగందుల గ్రామాలు ఉన్నాయి. దీని పరిధిలో 13 వేల సర్వీసులు ఉంటే, సుమారు 250 వరకు హైవోల్టేజీ విద్యుత్తును వినియోగించే గ్రానైట్ పరిశ్రమలు ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచే సంస్థకు ప్రతి నెల సుమారు రూ.1.80 కోట్ల రెవెన్యూ వస్తోంది. కానీ తరచూ అంతరాయం కలుగుతోంది. వెస్ట్ సెక్షన్‌లో 13 వేల సర్వీసులు ఉన్నాయి. మరో సెక్షన్ ఏర్పాటు చేయడానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. సిబ్బందిని మాత్రం నియమించడంలేదు. అదనంగా ఒక కార్యాలయం, అధికారి, సబ్ ఇంజనీరు పోస్టులు మాత్రం వస్తాయి. అసిఫ్‌నగర్‌లో ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లు, ఒకరు అన్‌మ్యాన్డ్, కాజీపూర్‌లో జేఎల్, అన్‌మ్యాన్డ్, బద్దిపల్లిలో జేఎల్, కమాన్‌పూర్‌లో జేఎల్, ఎలగందులలో జేఎల్, అన్‌మ్యాన్డ్, చింతకుంటలో ఒక లైన్‌మెన్, ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లు సేవలు అందిస్తున్నారు. వీరిలో ఒకరూ విధులకు హాజరకాకపోయినా సిబ్బందిపై భారం పడుతోంది.

నిబంధనలు మరిచి..

క్షేత్రస్థాయిలో వినియోగదారుల ఇబ్బందులను తొలగించడానికి సిబ్బందిని పెంచాల్సిన అవసరముందని ఎలక్ట్రిసిటీ బోర్డు నిర్ణయించింది. వెయ్యి సర్వీసులకు లైన్‌మెన్, ఇద్దరు అసిస్టెంట్, ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లను నియమించాలని చెప్పింది. కానీ విద్యుత్తు యాజమాన్యం సిబ్బందికి బదులుగా సెక్షన్ కార్యాలయాలను పెంచుతోంది. జిల్లాలో హెచ్‌టీ, ఎల్‌టీ సర్వీసులు 5,35,434 ఉన్నట్లు ఈఆర్‌సీ నివేదిక చెబుతోంది. ఈ సర్వీసులకు సేవలందించడానికి 1,410 పోస్టులకు విద్యుత్తు సంస్థ అనుమతి ఇస్తే, 1048 మంది పని చేస్తుండగా 362 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. స్తంభం ఎక్కి సాంకేతిక సమస్యలు పరిష్కరించే అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టులు 278 ఉంటే, 68 మందే పని చేస్తున్నారు. 210 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సమస్యలు ఇవి..

ఫీడర్‌లో కంట్రోల్ స్విచ్‌లో పగిలిపోయిన ఎరియల్ బ్రేకర్లను మార్చడంలో జాప్యం జరుగుతోంది. ఒక ప్రాంతంలో సమస్య వస్తే ఆ ఫీడర్‌లోని మిగతా ప్రాంత ప్రజలు విద్యుత్తు సరఫరాలేక ఇబ్బంది పడాల్సి వస్తోంది.

11కేవీ లైన్లలో మాత్రమే చెట్ల కొమ్మలు కొట్టి ఎల్‌టీ లైన్లలో వదిలేస్తున్నారు. చెట్లకొమ్మలు తగిలిన సమయంలో శబ్దాలతో మంటలు వస్తున్నాయి. ఇదే సమయంలో సరఫరాలో అంతరాయం వస్తోంది. చెట్ల కొమ్మలు తగిలి నియంత్రికలు బలహీనపడటంతో రాగి తీగ కాలిపోయే అవకాశముంది. కాలిపోయిన నియంత్రిక మార్చే వరకు ఆయా ప్రాంతాలకు సరఫరాలో అంతరాయం ఉంటుంది.

సిబ్బంది కొరతతో స్పాట్ బిల్లింగ్ ఆలస్యమవుతోంది. స్లాబ్ మారిందంటూ వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.

సిబ్బంది కొరతతో ఫ్యూజ్ ఆఫ్ కాల్ ఆలస్యమవుతుంది.

ఫ్యూజ్ ఆఫ్ కాల్‌ను నిర్వహించడానికి సరైన రిజిస్ట్రేషన్ విధానం లేకపోవడంతో సిబ్బందిని బాధ్యత చేసే పరిస్థితులు కనబడటంలేదు.

కొత్త సర్వీసుల మంజూరులో జాప్యం అవుతోంది.

ఘటనలు కొన్ని...

రామడుగు మండలం వెదిర గ్రామంలో శనిగరపు మల్లయ్య అనే రైతు పొలంలో ఎడ్లు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాయి. స్తంభం స్టే వైర్ తెగిపోవడంతో.. సిబ్బంది ఆ తీగను స్తంభానికి చుట్టిపెట్టడంతో విద్యుత్తు సరఫరా అయినట్లు స్థానికులు పేర్కొన్నారు.

పద్మనగర్‌లోని 33 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలోని చింతకుంట 11 కేవీ ఫీడర్ పరిధిలో తరచూ సరఫరాలో అంతరాయాలు వస్తున్నాయి. గంటల తరబడి కరెంటు సరఫరా నిలిచిపోతోంది.

చింతకుంట గ్రామం పరిధిలో సుమారు 6 వేల విద్యుత్తు సర్వీసులు ఉన్నాయి. గాంధీనగర్, రాజీవ్ గృహకల్ప, రాజీవ్‌నగర్, శాంతినగర్‌తో పాటు చింతకుంట ప్రాంతాలకు సేవలు అందించడానికి లైన్‌మెన్, ఇద్దరు జూనియర్ లైన్‌మెన్లు ఉన్నారు. ఇక అసిస్టెంట్ లైన్‌మెన్ పోస్టు ఖాళీగా ఉంది.

తీగలకు చెట్లకొమ్మలు తగలడంతోపాటు ఇన్సులేటర్లు పగిలితే సరఫరాకు అంతరాయం కలుగుతోంది. చింతకుంట 11కేవీ ఫీడర్ పరిశీలిస్తే సుమారు 15 కిలోమీటర్ల మేర ఇది విస్తరించి ఉంది. ఈ ఫీడర్‌లో సమస్య గుర్తించాలంటే సుమారు రెండు, మూడు గంటల సమయం పడుతోంది.

# ఆకట్టుకునే బోధన.. అబాకస్ శిక్షణ

కోరుట్ల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు గణితంలో రాణించేందుకు ఓ ఉపాధ్యాయుడు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గణితంలో బలమైన పునాది వేసి విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేయాలనే లక్ష్యంతో స్వయంగా అబాకస్‌లో శిక్షణ పొంది తాను పని చేసే సర్కారు బడిలో విద్యార్థులకు నిత్యం నేర్పిస్తూ వారితో క్రమంగా సాధన చేయిస్తున్నాడు. విద్యార్థులు నేర్చుకున్న అబాకస్‌ను ప్రదర్శించి ప్రపంచ రికార్డులను సాధించేలా చేయడంతో ఆ సర్కారు బడికి అంతర్జాతీయ స్థాయిలో అవార్డులను సాధించి పెట్టాడు. రాష్ట్రవ్యాప్తంగా 36 ప్రభుత్వ పాఠశాలల విజయగాథలతో ఎస్.సి.ఇ.ఆర్.టి.(స్టేట్ కౌన్సిల్, ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరానికి సబంధించి 'ఇంపాక్ట్ ఇన్‌ఫ్లుయెన్స్ ఇన్‌స్పిరేషన్' పుస్తకాన్ని ఇటీవల విడుదల చేసింది. ఇందులో కోరుట్ల పట్టణం అంబేద్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అడ్డగట్ల గంగాధర్



విద్యార్థులకు నేర్పిన 'అబాకస్ ఆన్ ఫింగర్స్ పేపర్‌లెస్ ప్రామిస్' అనే అంశం మొదటిదిగా ప్రచురితం కావడం విశేషం.

శిక్షణతో ప్రత్యేక గుర్తింపు..

కోరుట్ల పట్టణం అంబేద్కర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అడ్డగట్ల గంగాధర్ ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. పాఠశాలలో ప్రస్తుతం 130 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గంగాధర్ విద్యార్థులకు విద్యాబోధన చేయడంతోపాటు వారిని మరింతగా ఆకర్షితులను చేసేందుకు 2006లో గణితంపై పట్టు సాధించేందుకు పూసల చట్రం(అబాకస్)లో హైదరాబాద్‌లో స్వయంగా శిక్షణ పొందాడు. తాను పని చేసే ప్రతి పాఠశాలలో విద్యార్థులకు అబాకస్‌లో శిక్షణ ఇస్తున్నాడు. గంగాధర్ వినూత్నంగా పూసల చట్రం ద్వారా కాకుండా చేతి వేళ్లు లెక్కిస్తూ వాటి ద్వారా కూడికలు, తీసివేతలు, గుణించడం, ఎక్కాలు విద్యార్థులకు నేర్పించాడు. విద్యార్థులు ఎడమ చేతి, కుడి చేతి వేళ్లను ఉపయోగించవచ్చు. కుడి చేతి వేళ్లను 0, 1, 2, ...9గా లెక్కించడానికి, అదే సమయంలో ఎడమ చేతి వేళ్లు 10, 20, 30 ...90 ఇలా లెక్కిస్తారు. 1వ తరగతి విద్యార్థుల్లో సంఖ్య భావనను అభివృద్ధి చేసేందుకు అబాకస్‌ను ఉపయోగిస్తాడు. 0 నుంచి 100 సంఖ్యలను గుర్తించడం, 0-100 సంఖ్యలను చదవడం, 0-100 సంఖ్యలను రాయడం నేర్పిస్తాడు. 770 సెకన్లలో 100 ఎక్కాలు విద్యార్థులతో చెప్పించి ప్రపంచ రికార్డు సాధించాడు. 60 నిమిషాల వ్యవధిలో 4,250 సమస్యలను స్కేటింగ్ చేస్తూ పరిష్కరించి రికార్డు సృష్టించాడు. 1వ తరగతికి చెందిన ఇద్దరు విద్యార్థులు కళ్లకు గంతలు కట్టుకుని నిమిషంలో 30 సమస్యలను పరిష్కరించడంతో యూకేలోని ది జీనియస్ బుక్ ఆఫ్ రికార్డును సాధించారు. ఇండియా ప్రైడ్ అవార్డు, జాతీయ స్థాయిలో ఐ టాప్ బెస్ట్ టీచర్ అవార్డు, స్టేట్ బుక్ ఆఫ్ అవార్డులను దక్కించుకున్నారు. గతేడాది ప్రభుత్వం రూపొందించిన 'రైస్ అండ్ షైన్' బుక్‌లోనూ గంగాధర్ ఇస్తున్న అబాకస్ శిక్షణపై ప్రత్యేక కథనాన్ని ముద్రించారు.

గణితంపై పట్టు, చురుకుదనం

1వ తరగతి నుంచి విద్యార్థులకు అబాకస్‌లో శిక్షణ ఇవ్వడంతో గణితంపై పూర్తిస్థాయిలో పట్టు సాధిస్తారు. నిత్యం అబాకస్‌లో సాధన చేయడంతో చతుర్విధ ప్రక్రియలో సులభంగా నేర్చుకుంటారు. విద్యార్థుల్లో ఉత్సాహం, చురుకుదనం, జ్ఞాపకశక్తి, గ్రహించే శక్తి పెంపొందుతుంది. క్యాలిక్‌లేటర్ సాయం లేకుండానే చేతి వేళ్ల ద్వారా గణిత సమర్థ్యాలను పూర్తి చేస్తుంటారు. గణితంలో రాణించేందుకు అబాకస్ ఎంతగానో ఉపయోగపడుతుంది. అడ్డగట్ల గంగాధర్, ప్రధానోపాధ్యాయుడు

# ఖాళీ స్థలాలు.. అపరిశుభ్రతకు నిలయాలు

కరీంనగర్ : 'ఖాళీ ప్లాటులో చెత్తా చెదారం, మురికి నీరు నిల్వ ఉండి ప్రజారోగ్యానికి నష్టం కలిగించినట్లయితే వ్యాధుల చట్టం 1897, తెలంగాణ మున్సిపాలిటీల చట్టం 2019 సెక్షన్ 161(1) ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకునే అవకాశం ఉంది.' అయినా ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్, రామగుండం నగరపాలక సంస్థలతోపాటు పలు మున్సిపాలిటీల్లో ఖాళీ స్థలాల్లో నీరు నిండినా పట్టించుకునేవారే లేరు. ఎండాకాలంలో చెత్తాచెదారం నిండి ఉంటుండగా.. వర్షాకాలంలో ఆ స్థలాలు కుంటలను తలపిస్తున్నాయి. నిల్వ నీరు బయటకు వెళ్లే దారి లేకపోవడం, అందులోనే నీరంతా ఉండటం, పిచ్చి మొక్కలు, తుమ్మ చెట్లు, చెత్తా చెదారంతో నిండి దుర్గంధంగా వెదజల్లుతోంది. పైగా ఈ ఖాళీ స్థలాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారి ఇబ్బంది పెడుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 14 మున్సిపాలిటీలు, రెండు నగరపాలకల పరిధిలో సుమారు 1,10,684 ఖాళీ ప్లాట్ల ఎల్‌ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అందులో నీరు నిలిచి, అపరిశుభ్రతకు నిలయంగా ఉన్నవి 50వేలకు పైగానే ఉంటాయి.

వ్యాధుల కాలం : ఇటీవలి భారీ వర్షాలతో దోమల సంఖ్య విపరీతంగా పెరిగింది. పురపాలక అధికారులు ఫాగింగ్ చేసిన ఒకటెండ్రు రోజుల వరకు కాస్త తగ్గుతుండగా మళ్లీ విజృంభిస్తుండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలు మరిన్ని సమస్యలకు కారణంగా తయారయ్యాయి. నీరు నిల్వ ఉండటంతో లార్వా తయారైంది. పైగా అందులోంచి క్రిమికీటకాలు, పందులు, పశువుల సంచారం జనాన్ని ఇబ్బంది పెడుతోంది.

నామమాత్రంగా హెచ్చరిక నోటీసులు : పట్టణాలు, నగరాల్లో నివాసిత ఇళ్ల మధ్యన ఖాళీ స్థలాలు ఉండగా వాటి నిర్వహణ సరిగా ఉండటం లేదు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో ఖాళీ స్థలాలు గుర్తించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజారోగ్యానికి హాని కలిగించొద్దని హెచ్చరిక నోటీసులు ప్రదర్శిస్తున్నా పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదు. కనీసం అందులో బేస్‌మెంటు మేర మొరం కాని, నీరు నిల్వ ఉండకుండా, చెట్లు పెరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం కానీ చేయడం లేదు. మూడేళ్ల కిందట కరీంనగర్ భగత్‌నగర్‌లో కాలనీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చుట్టూ ఉన్న ఖాళీ స్థలాల్లో మొరం పోయించుకొని ఆదర్శంగా నిలిచారు. అలాగే నగరాలు, పట్టణాల్లో సమష్టిగా ముందుకొస్తే ఆరోగ్యకర సమాజం నిర్మితమవుతుంది.

పట్టణవాసుల్లో స్పందన ఏదీ? : ఖాళీ స్థలాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేలా నగర, పురపాలికల పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తుండగా ప్రజల్లో స్పందన ఉండటం లేదంటున్నారు. ఇళ్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ఇంటి ముందు, వెనుకాల చెత్తా చెదారం, వ్యర్థాలు పడేయకూడదని ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు అంటిస్తుండగా కొందరు పట్టనట్లుగా ఉంటున్నారు. ఖాళీ స్థలాలు శుభ్రం చేసుకోవాలని అధికారులు పదే పదే కోరుతుండగా ఇంటి యజమానులు నిర్లక్ష్యం చూపుతుండగా కొందరు ప్రజాప్రతినిధులు వారికి వత్తాసు పలుకుతున్నారు. దగ్గరుండి వాటిని శుభ్రం చేసుకునేలా ప్రోత్సహించాల్సిన వారే నిర్లక్ష్యానికి తావిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో సాగి ఖాళీ స్థలాలు శుభ్రంగా ఉండేలా చూస్తే జనానికి వ్యాధుల ముప్పును తగ్గించినవారవుతారు.

# మీరూ నమూనా ఓటేయొచ్చు!

ఖమ్మం : పోలింగ్ బూత్‌లో ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం)పై ఓటు వేసే సమయంలో కొందరు ఓటర్లు తడబడుతుంటారు. అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు కూడా.. 'ఏ మీట నొక్కాలా?' అని కంగారు పడే వారూ ఎక్కువే. తీరా బయటకు వచ్చాక.. ఓటు అనుకున్న గుర్తుపైనే పడిందా? అనే సందేహాలూ వెంటాడుతుంటాయి. ఈ నేపథ్యంలో యంత్రాలపై ఓటేసే సమయంలో తలెత్తే సందేహాలను, అపోహలను ముందే నివృత్తి చేసుకునేందుకు భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లో సంచార (మొబైల్) పోలింగ్ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఎవరైనా ఓటర్లు వీటి వద్దకు వచ్చి నమూనా (మాక్) పోలింగ్‌లో



ఓటేయొచ్చు. ఏమైనా సందేహాలుంటే అధికారులు, సిబ్బందితో మాట్లాడి నివృత్తి చేసుకోవచ్చు.

అచ్చు.. అలాగే..

మొబైల్ వాహనంలో నిజ ఎన్నికల తరహాలో ఈవీఎం యంత్రం, వీవీప్యాట్ అమర్చి ఉంటాయి. ఈవీఎంపై ఓటు ఎలా వేయాలో సంబంధిత అధికారి ఓటర్లకు వివరిస్తున్నారు. నమూనా గుర్తుపై మీట నొక్కిన వెంటనే పక్కనున్న వీవీప్యాట్‌లో ఒక చీటీ మూడు సెకన్లపాటు కనిపిస్తుంది. దానిపై ఓటు ఏ గుర్తుకు వేశారో అది కనిపిస్తుంది. ఆ తర్వాత చీటీ యంత్రం లోపలకు జారిపోతుంది. దాన్నెవరూ బయటకు తీయలేరు. ఇవి కాకుండా ఏ సందేహాలున్నా అక్కడ ఉండే వారిని అడిగి నివృత్తి చేసుకోవచ్చు.

ఖమ్మం జిల్లాలో.. నియోజకవర్గానికి రెండు చొప్పున 10 మొబైల్ పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జులై 22 తేదీ నుంచి నిర్దేశిత గ్రామాలు, పట్టణాల్లో అందుబాటులో ఉంటున్నాయి. ఇవికాక ప్రతి నియోజకవర్గ కేంద్రంలోని ఆర్వో కార్యాలయం, కలెక్టరేట్‌లో మరొక కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నెల 5వ తేదీ నాటికి జిల్లావ్యాప్తంగా 26 వేల మందికి పైగా అవగాహన కల్పించినట్లు ఖమ్మం జిల్లా స్వీప్ అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలిపారు.

భద్రాద్రి జిల్లాలో.. ఐదు నియోజకవర్గాల్లో ఒక్కోదానికి ఒకటి చొప్పున సంచార కేంద్రాలను అందుబాటులో ఉంచారు. ఈ జిల్లాలో మొత్తం 1,092 పోలిం కేంద్రాలున్నాయి. వీటిల్లో 697 కేంద్రాలను మొబైల్ కేంద్రాల అధికారులు, సిబ్బంది సందర్శించేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకు 52 పోలిం కేంద్రాల్లో ఈవీఎంల సాయంతో ఓటిం విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. నమూనా ఓటింగ్‌కు మొత్తం 5,396 మంది ఓటర్లు హాజరైనట్లు జిల్లా అధికారులు తెలిపారు.

# పేరుకే సూపర్ సేవలు..

వరంగల్ : వరంగల్ శివనగర్‌కు చెందిన సరోజకు రొమ్ము క్యాన్సర్ సోకింది. ఆరోగ్య శ్రీ కింద ఒక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కణాలు శరీరంలో మరో భాగానికి సోకాయా లేదా అని తెలుసుకునేందుకు 'పెట్ స్కాన్' చేయాల్సి ఉంది. ఈ పరీక్ష చేయడానికి ప్రయివేటులో రూ.30 వేల వరకు వసూలు చేస్తున్నారు. అంత మొత్తం భరించలేక రోగి కుటుంబసభ్యులు స్కానింగ్ వాయిదా వేసుకుంటున్నారు.

పెట్ స్కాన్ యంత్రం కేఎంసీ సూపర్ స్పెషాలిటీలో లేకపోవడంతో రోగులు ప్రయివేటు ఆసుపత్రులకు వెళ్లాల్సి వస్తోంది. కేఎంసీలో అంకాలజీ విభాగం ఏర్పాటు చేశాక నెలకు క్యాన్సర్ బాధితులు కనీసం 300 మంది వస్తున్నారు. ఈ యంత్రం లేకపోవడంతో వీరిపై తీవ్ర ఆర్థిక భారం పడుతోంది.

ఒకవైపు: కాకతీయ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి (కేఎంసీ)కి రోగుల తాకిడి పెరుగుతోంది. కార్డియాలజీతోపాటు, న్యూరో, యూరాలజీ, అంకాలజీ తదితర విభాగాల్లో శస్త్రచికిత్సలు అందుతుండడంతో ఉమ్మడి వరంగల్‌తోపాటు, పూర్వ కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వైద్యం కోసం వస్తున్నారు.

ఇదీ పరిస్థితి..

ప్రస్తుతం హృద్రోగ శస్త్రచికిత్సల కోసం ఒక యూనిట్ కింద ఇద్దరే వైద్యులు గతంలో ముగ్గురు ఉండగా.. ఒకరు రాజీనామా చేసి వెళ్లారు. ప్రస్తుతం ఓపెన్‌హార్ట్ సర్జరీలు నెలకు 15 వరకు జరుగుతు న్నాయి. ఈ విభాగంలో అదనంగా మరో యూనిట్ ఉంటే కనీసం రోజుకొకటి చొప్పున చేసేందుకు అవకాశం ఉంటుంది.

పలువురు వైద్యులు పదోన్నతిపై మహబూబాబాద్ వైద్య కళాశాలకు బదిలీ అయ్యారు. దీంతో కేఎంసీలో ఖాళీలు ఏర్పడ్డాయి. ఒక న్యూరో సర్జరీ వైద్యుడు భద్రాద్రి కొత్తగూడెం కళాశాలకు వెళ్లారు. న్యూరోలో శస్త్రచికిత్సలు కుంటుపడ్డాయి. ఇక్కడ ఒకటే యూనిట్ ఉంది.

సర్జికల్ అంకాలజీ, సర్జికల్ గ్యాస్ట్రోలో వైద్యులు మొత్తం ఖాళీ అయ్యారు. జనరల్ సర్జరీలో మొత్తం ముగ్గురే వైద్యులు ఉండగా.. వీరితోనే ఆరు యూనిట్లు నడిపిస్తున్నారు. ఇలా వివిధ విభాగాల్లో వైద్యుల కొరత ఉండడంతో కేఎంసీకి రావాల్సిన పీజీ సీట్లు తగ్గాయి.

కీలకమైన ఎంఆర్ఐ స్కానింగ్ యంత్రం కేఎంసీలో ఏర్పాటుకాలేదు. ఎంజీఎంలో కొత్తది ఏర్పాటు చేసినా ప్రారంభం కాలేదు. ప్రయివేటులో ఈ పరీక్షకు రూ.3 వేలకుపైగా వసూలు చేస్తున్నారు.

కేఎంసీలో ల్యాబ్ పరీక్షల కోసం ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తోంది. ఇక్కడ టెక్నీషియన్లు ఉన్నా నిర్ధారణ చేసే పాథాలజీ వైద్యులు లేరు.

మరోవైపు: రోగుల సంఖ్యకు సరిపడా వైద్యులు ఉండడం లేదు. పలు రకాల పరీక్షలు చేసేందుకు పరికరాలు లేకపోవడంతో నిరుపేదలు ప్రయివేటు బాట పట్టాల్సి వస్తోంది. దీంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది.

కొత్త ఆసుపత్రి వచ్చే వరకు..

రాష్ట్ర ప్రభుత్వం 24 అంతస్తులతో 38 విభాగాల సూపర్ సేవలతో వరంగల్ కేంద్ర కారాగారం స్థలంలో ఆసుపత్రిని నిర్మిస్తోంది. ఇక్కడ దసరా నుంచి ఓపీ సేవలు ప్రారంభమవుతాయని గతంలో మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. ప్రస్తుతం ఇది నిర్మాణ దశలో ఉంది. 24 అంతస్తులకు 15 మాత్రమే పూర్తయ్యాయి. దసరాకు ఓపీ సేవలు ప్రారంభించినా శస్త్రచికిత్సలకు మరో ఏడాది సమయం పట్టే అవకాశం ఉంది. అప్పటి వరకు కేఎంసీ ఆసుపత్రే కీలకం. కొత్త ఆసుపత్రి వచ్చినా కేఎంసీలో ఇప్పుడున్న రోగుల రద్దీ తగ్గే అవకాశం లేదు.

శస్త్ర చికిత్స కోసం ఆరు నెలలుగా – బాదావత్ సోమ్లా, రావూరు, పర్వతగిరి మండలంనేను నడుం నొప్పితో బాధపడుతున్నా. ఆరు నెలల నుంచి చికిత్స పొందుతున్నా. మెడ నొప్పి కూడా ఉంది. ఆపరేషన్ అవసరం ఉందని డాక్టర్లు చెప్పారు. మందులు ఇచ్చి పంపుతున్నారే తప్ప శస్త్ర చికిత్స చేయడం లేదు.

# ఆసుపత్రిగా మారిన పాఠశాల!

కొత్తగూడెం : మండలంలోని సోంపల్లి జ్వరాలతో వణుకుతోంది. గ్రామానికి చెందిన సుమారు 60 మంది జ్వర లక్షణాలతో బాధపడుతూ.. వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. ఒక్కో ఇంట్లో ఇద్దరు, ముగ్గురు బాధితులు ఉండటం సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. సోంపల్లిలో 220 నివాసాలున్నాయి. ఇక్కడ సుమారు 800 మంది జనాభా ఉన్నారు. కిన్నెరసాని తీరాన ఉన్న ఈ గ్రామంలో అధిక శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇక్కడి ప్రజలు ప్రస్తుతం జ్వరాలతో అల్లాడుతున్నారు. చాలామంది పాల్వంచ సీహెచ్‌సీ, మోరంపల్లి బంజర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు పలు ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. మరో 70 మంది వరకు చికిత్సతో కోలుకున్నాక ఇళ్లకు చేరుకున్నారు.

తగ్గుముఖం పట్టని వైనం..

మోరంపల్లిబంజర పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నాలుగైదు సార్లు గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపట్టారు. అయినా జ్వరాలు తగ్గుముఖం పట్టలేదు. దీంతో చేసేదేమీ లేక..



స్థానిక ప్రభుత్వ పాఠశాలలో తాత్కాలికంగా శిబిరం ఏర్పాటు చేసి జ్వర బాధితులకు వైద్యం అందిస్తున్నారు. ఓ బాలుడికి డెంగీ నిర్ధారణ అయింది. అతడు నివసించే వీధిలోనే మరో కుటుంబంలో ముగ్గురు జ్వరంతో బాధ పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి జ్వరాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# గృహలక్ష్మి కటాక్షానికి దరఖాస్తు



కొత్తగూడెం : పేద, బడుగు, బలహీనవర్గాల సొంతింటి కల సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకాన్ని అమలు చేస్తోంది. దరఖాస్తుల స్వీకరణతో పథకం అమలును పట్టాలెక్కిస్తూ ఉమ్మడి ఖమ్మం జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. నిరుపేదల ఆకాంక్షలను తీర్చడానికి ప్రభుత్వం రెండు పడకల గదుల ఇళ్ల నిర్మాణాలను కొనసాగిస్తోంది. పూర్తయిన వాటిని వెంటనే అర్హులను వడపోసి కేటాయిస్తోంది. కానీ ఇంకెంతో మంది అర్హులు గూడు కోసం గోడువెళ్లబుచ్చుతున్నారు. ఈ క్రమంలో సొంత జాగా ఉండి, ఇల్లు నిర్మించుకునే స్థోమతలేని పేదల కోసం ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకం అమలు చేస్తోంది. ఒక్కో లబ్ధిదారుకు రూ.3 లక్షల సాయం అందించనుంది. తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక విభాగం గణాంకాల ప్రకారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సొంత నివాసాలు లేక అద్దె ఇళ్లల్లో నివసిస్తున్నవారు సుమారు 1.10 లక్షల మంది ఉన్నారు. వీరిలో కొందరికి సొంత జాగాలున్నా.. ఇల్లు నిర్మించుకునే స్థోమత లేదు. గ్రామీణ ప్రాంతాల్లో పూరిళ్లు, తాత్కాలిక రేకుల ఇళ్లల్లో నివసించే వారు చాలామంది ఉన్నారు. ఇలాంటి వారిలో ప్రస్తుతం నియోజకవర్గానికి 3 వేల మందిని అర్హులుగా ఎంపిక చేయనున్నారు.

స్థానిక కార్యాలయాల్లో స్వీకరణ

ఇళ్ల దరఖాస్తులను ఈ నెల 10వ తేదీలోపు అందజేయాలని ఉన్నతాధికారులు వెల్లడించారు. స్థానిక పంచాయతీ కార్యాలయాల్లోని కార్యదర్శులకు, ఎంపీడీవో, స్థానిక పురపాలక కార్యాలయాల్లోనూ దరఖాస్తులు అందజేయొచ్చు. ఈ విషయమై అవగాహన లేకపోవడంతో కొందరు పేదలు కలెక్టరేట్‌లకు బారులుదీరుతున్నారు. దరఖాస్తుదారుల సమర్పణ విషయానికి వస్తే.. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి స్థలం దస్తావేజులు, బ్యాంకు పాస్‌బుక్ నకళ్లు జతపరిస్తే చాలని అధికారులు పేర్కొన్నారు.

రిజర్వేషన్ల వారీగా..

ప్రతి నియోజకవర్గంలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీ, మైనార్టీలకు 50 శాతానికి తగ్గకుండా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. మిగిలిన వారిని తదుపరి జాబితా(వెయిటింగ్ లిస్ట్)లో చేర్చుతారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హుల జాబితా కలెక్టర్లకు అందజేస్తారు. అనంతరం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో కలెక్టర్, మున్సిపాలిటీల్లో కమిషనర్ ఆమోదంతో బ్యాంకు ఖాతాలకు నగదు జమ చేస్తారు. పునాది (బేస్‌మెంట్ లెవల్), స్లాబు (రూఫ్), తుది పనుల దశల్లో మూడు విడతల్లో నగదు ఖాతాల్లో వేస్తారు.

ఈసారైనా కనికరించండి సారూ..

ఈ చిత్రంలోని అక్కాతమ్ముళ్ల పేరు లక్ష్మి, నరసింహ. వీరిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం గాండ్ల బయ్యారం. లక్ష్మి భర్త మరణించాడు. దీంతో మతిస్థిమితం సరిగా ఉండని తమ్ముడితో కలిసి ఓ పూరి గుడిసెలో తలదాచుకుంటోంది. గతేడాది కురిసిన భారీ వర్షాలకు వీరి ఇల్లు కూలిపోయింది. అప్పట్నుంచి స్థానిక రామాలయంలో ఆశ్రయం పొందుతున్నారు. రెండు పడకల గదుల ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ నిరాశే ఎదురైంది. గృహలక్ష్మి పథకం ద్వారానైనా సాయమందిస్తే గూడు కట్టుకుంటామని ఉన్నతాధికారులను వేడుకుంటున్నారు.

వరద బాధితులకు ఉపశమనం

గత రెండేళ్లుగా భారీ వర్షాలకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పలువురి పూరిళ్లు, రేకుల ఇళ్లు, శిథిలావస్థకు చేరిన పాత భవనాలు దెబ్బతిన్నాయి. ఆయా బాధితులకూ గృహలక్ష్మి పథకం వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

క్షేత్రస్థాయిలో పరిశీలించాకే అర్హుల ఎంపిక

గృహలక్ష్మి పథకం దరఖాస్తులను స్థానిక పంచాయతీల్లో, ఎంపీడీవో కార్యాలయాల్లో అందించవచ్చు. దరఖాస్తు గడువు ముగిసిన తర్వాత క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతాం. అనంతరం అర్హుల జాబితా ఉన్నతాధికారులకు పంపిస్తాం. పథకం అమలులో ఎలాంటి అవకతవకలు జరగకుండా, పూర్తి పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

చంద్రశేఖర్, ఎంపీడీవో, పినపాక

# ప్రతిరోజూ పండుగే.. ఊరంతా సందడే



భద్రాచలం : కొండలు కోనలు.. కాకులు దూరని కారడవులు. చెంగుచెంగున దూకే సెలయేళ్లు.. ఇలాంటి ప్రకృతి రమణీయతను జీవన సారాంశంగా అనుభవిస్తున్న భద్రాచలం మన్యం అడవి బిడ్డల సంస్కృతి, సంప్రదాయాలను చూడాలంటే రెండు కళ్లు చాలవు. ప్రతి పనికి ముందు పండుగ చేస్తుంటారు. ఆదివాసీల ఇంట్లో పెళ్లి జరుగుతుందంటే సకుటుంబ సపరివార సమేతంగా బంధుమిత్రులను ఆహ్వానిస్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 10.69 లక్షల మంది నివసిస్తుండగా వీరిలో 3.92 లక్షల మంది గిరిజనులే. ఈ జిల్లాలో కోయ, లంబాడి, ఎరుకల, కొండరెడ్డి, నాయకపోడు, గొత్తికోయ వంటి ముఖ్యమైన గిరిజన తెగలున్నాయి. అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం నిర్వహిస్తారు. ఆదివాసుల హక్కుల పరిరక్షణకు ఈ దినోత్సవం నిర్వహించాలని ఐరాస ప్రకటించింది.

ఆచార వ్యవహారాలు

రేల పాటలకు పెట్టింది పేరు మన్యం. డప్పు దరువులు, డోలు శబ్దాలకు అనుగుణంగా సహజసిద్ధంగా నృత్యాలు చేస్తుంటారు. కొమ్ము తలపాగా ధరించటం అంటే సరదా. ఆదివాసీగూడేలలో ఏ పని చేయాలన్నా ఇలవేల్పులకు మొక్కు చెల్లిస్తారు. గ్రామదేవతలను ఆరాధిస్తారు.

భూమి పండుగ: మనిషి పుట్టేది.. గిట్టేది భూమిపైనే. జీవరాశికి తిండి పెట్టేది భూమే కావడంతో ఎంతో నిష్ఠతో గ్రామ పూజారి శుద్ధిపూజలు చేస్తారు. యువకులు విల్లు అమ్ములు పట్టుకుని వేటకు వెళ్లేటప్పుడు ఆడవాళ్లు పసుపు నీళ్లు చల్లి చల్లగా తిరిగిరావాలని దీవిస్తారు. వేటతో పాటు అటవీ సంపద రక్షణ అనేది వేడుకలో ఇమిడి ఉంది.

కొత్తల పండుగ: సంక్రాంతి తరహాలో ఆదివాసీలు చేస్తుంటారు. పూరిళ్ల అరుగులను అలుక్కుని ముగ్గులతో అలంకరిస్తారు. ముత్యాలమ్మకు నిండు బిందె నీళ్లు పోసి పూజిస్తారు. కోడిపుంజులను కోసి నైవేద్యం అందించి కలిసి భోజనం చేస్తారు. ఆ రోజు రాత్రికి ఇంటిపేరు గల వారంతా ఒకచోటుకు చేరి కొత్తగా చేతికొచ్చిన గోంగూర, దోసకాయ, మొక్కజొన్న, వరి ధాన్యం వంటివి దేవుడి గదిలో ఉంచుతారు. గుమ్మాలకు కడతారు. ఇలా చేయటం వల్ల పక్షులకు ఆహారం అందుతుంది. ఆతర్వాతే ఆదివాసీలు కొత్త పంటలను తింటారు.

ఇప్ప పువ్వుల పండుగ: దీన్ని ఇక్కిం పండూం/పొక్కల పండుగ అంటారు. చక్కని పరిమళం ఈ పువ్వుల సొంతం. వీటికి ఔషధ గుణాలున్నాయి. అడవిలో ఏరుకుని ఇంటికి తెచ్చాక ఆరబెడతారు. ఆదివాసీలకు ఇప్ప చెట్టు అంటే కల్పవృక్షంతో సమానం. ఇప్పగింజల నుంచి వచ్చే నూనెతో దీపారాధన చేస్తే దోమలు దరిచేరవు. ఇప్పచెట్టును పూజించి ఇప్పపుల్లను నీటిలో వదులుతారు. ఇది నీటిలో మునిగితే వర్షాలు బాగా కురుస్తాయని నమ్మకం. దీన్నిబట్టి వార్షిక కార్యక్రమాలను నిర్ణయించుకుంటారు. ఈ పండుగ తర్వాతే పూలు సేకరిస్తారు.

చిక్కుడు పండుగ: దీన్ని చుక్కుడు పండూం అంటారు. ఈ పండుగ చేయకుండా ఒక్క చిక్కుడుకాయ కూడా కోయరు. తినరు. గ్రామదేవతకు మొక్కు చెల్లించాక రేలా ఆడి చిక్కుడుకాయలు కోస్తారు.

ముఖ్యమైన వేడుకలు: మామిడిఫలం చేతికందాక గంగానమ్మకు సమర్పించి మొక్కు చెల్లిస్తారు. సంస్కృతి, సంప్రదాయాలతో మామిడి పండుగ నిర్వహిస్తారు. తీజ్ పండుగ, తాడీస్ పండూం, వేల్పుల పండుగ, కొర్రాజుల కొలుపు, దాటోడి పండుగ వంటివి ఎంతో ప్రత్యేకమైనవి. వీటిని గొప్పగా నిర్వహిస్తారు. చేపల వేట అంటే వీరికి మక్కువ.

వివాహం అంటే.. అదో సంబరమే..

వరసయ్యే గోత్రాల ప్రకారం పెళ్లి సంబంధాలు చూస్తుంటారు. ముహూర్తంలో పెళ్లిపందిరికి ప్రాధాన్యముంటుంది. పూజారి నిర్ణయించిన ముహూర్తం రోజున గొయ్యి తవ్వి గుంజను నిలబెడతారు. రోకలి చివరి మొనలను పాలలో ముంచి పెళ్లికొడుకు గుండెకు ఆనిస్తారు. ఈ పాలను పెళ్లికొడుకుకు తాగించి మిగిలినవి పెళ్లికూతురికి ఇస్తారు. అందరూ కలిసి చెట్ల కింద భోజనాలు చేస్తారు. దీన్ని దుబ్బజావ అంటారు. భోజనాల తరువాత ఆటపాటలతో నృత్యం చేస్తారు. ఆదివాసీ జంటలు అన్యోన్యతను ప్రదర్శిస్తాయి. పట్టణీకరణ వాతావరణం వచ్చినప్పటికీ యువత సైతం తమ సంస్కృతిని రక్షించుకునేందుకు ఆసక్తి చూపుతోంది.

# సకల వసతులు.. కార్పొరేట్ హంగులు

భూపాలపల్లి : కార్పొరేట్ భవనాన్ని తలపించే హంగులు.. గాలి, వెలుతురు, సూర్యరశ్మి వచ్చేలా గదులు.. సకల వసతులతో ఆకట్టుకునేలా జిల్లా పోలీసు కార్యాలయం సిద్ధమవుతోంది. నిర్మాణం రాజభవనాన్ని తలపిస్తోంది.. జిల్లాల ఆవిర్భావం తర్వాత ప్రభుత్వం పోలీసు కార్యాలయ భవనాన్ని మంజూరు చేసింది. భూపాలపల్లి పట్టణంలోని జవహర్‌నగర్‌కాలనీ చివర్లో మున్సిపల్ కార్యాలయ సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. భవన నిర్మాణం పూర్తయింది. గదులు తుది మెరుగులు దిద్దే దశలో ఉన్నాయి. భవనం మొత్తం రంగులు అద్దుతున్నారు. విద్యుత్తు, నీటి వసతి పనులు జరుగుతున్నాయి. చివరగా ముఖ ద్వారం నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. రాష్ట్రంలో కొత్త జిల్లాల్లో నిర్మించే జిల్లా పోలీసు కార్యాలయాలన్నీ దాదాపు ఇదే నమూనాతో నిర్మిస్తున్నారు.

రూ.17 కోట్లతో నిర్మాణం

భూపాలపల్లిలో నిర్మించే భవన నిర్మాణం పోలీసు హౌజింగ్ బోర్డు ఆధ్వర్యంలో జరుగుతోంది. రూ.17 కోట్ల వ్యయంతో 49,000 చదరపు గజాల విస్తీర్ణంలో మూడు అంతస్తుల్లో నిర్మించారు. ఎలాంటి విపత్తులు ఎదురైనా తట్టుకునేలా ఇంజినీరింగ్ పరిజ్ఞానం ఉన్న భవన సముదాయంలో అనేక వసతులు ఏర్పాటు చేస్తున్నారు.

గ్రౌండ్ ఫ్లోర్‌లో..

ఇందులో మొత్తం 16 విభాగాలుంటాయి. ఎస్పీ, ఏఎస్పీ గదులతో పాటు వారి ఓఎస్‌డీలు, సీసీలు, పీఆర్వోలకు వేర్వేరుగా గదులుంటాయి. స్పోర్ట్స్, ఇన్, అవుట్ వార్డులతోపాటు పాస్‌పోర్టు విచారణ, ఐటీసీ



విభాగాలున్నాయి. రిసెప్షన్‌తోపాటు గ్రీవెన్స్ కోసం ప్రత్యేకంగా హాలు ఉంది.

21 గదులు..

మొదటి అంతస్తులో పరిపాలన విభాగంలోని ఆయా సెక్షన్ల సూపరింటెండెంట్‌లు, వారికి ప్రత్యేకంగా రికార్డు గదులు, మినీ కాన్ఫరెన్సు హాలు, న్యాయసేవా విభాగం ఇలా అన్నీ కలిసి మొత్తం 21 గదులున్నాయి. ఇందులోనే స్పెషల్ బ్రాంచ్‌కు కేటాయించారు.

రెండో అంతస్తులో..

ట్రాఫిక్ కమాండ్ కంట్రోల్, సీసీటీఎన్ఎస్‌తో పాటు నేర పరిశోధనలోని ప్రత్యేక విభాగాలకు కేటాయించారు. ఐటీ కోర్, సీఆర్‌డీ అనాలసిస్, సైబర్‌ల్యాబ్, ఫింగర్ ప్రింట్, క్లూస్‌టీం, డీసీఆర్‌బీ, రిపోగ్రాఫిక్, పీడీ సెల్, డిజిటల్ శిక్షణ ల్యాబ్‌తో పాటు మహిళా పోలీసు సిబ్బంది విశ్రాంతి గదులు ఉన్నాయి. టెర్రస్‌పైన కాన్ఫరెన్స్ హాలు, శిక్షణ కేంద్రంతో పాటు ఉద్యోగుల కోసం భోజనశాల ఏర్పాటు చేశారు.

ఈ నెలాఖరులో ప్రారంభం

భూపాలపల్లిలోని మంజూర్‌నగర్‌లో కొత్తగా నిర్మించే కలెక్టర్ కార్యాలయం పనులు కూడా పూర్తయ్యాయి. రంగులు వేస్తున్నారు. ఇటీవల ప్రధాన రహదారి నిర్మించారు. కలెక్టర్ కార్యాలయంతో పాటు జిల్లా పోలీసు కార్యాలయం ఒకేసారి ఈ నెలాఖరులో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా ప్రారంభంకానున్నాయి.

పోలీసు శాఖపై ప్రత్యేక దృష్టి–పుల్లా కరుణాకర్, ఎస్పీ

నూతన జిల్లా పోలీసు కార్యాలయం అన్ని వసతులతో ఉంది. ప్రభుత్వం పోలీసు శాఖపై ప్రత్యేక దృష్టి సారించింది. కొత్త భవనాలు నిర్మించి కార్యాలయాలు ఏర్పాటు చేస్తోంది. పోలీసు అధికారులు, సిబ్బందికి సౌకర్యవంతంగా ఉండేలా చేస్తోంది. ఇప్పటికే పోలీసు శాఖకు కొత్త వాహనాలు సమకూర్చింది. కొద్ది రోజుల్లో జిల్లా పోలీసు కార్యాలయ ప్రారంభం జరగనుంది.

# వంతెనల నిర్మాణమెప్పుడు..?

తొర్రూరు :: తొర్రూరు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న లోలెవెల్ కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. భారీ వర్షాలు కురిసినప్పుడు వీటిపై నుంచి వరద నీరు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఆ సమయంలో పలు గ్రామాల మధ్య ప్రజల రాకపోకలు నిలిచిపోతున్నాయి. అంతేకాక మనుషులు, జంతువులు వరదనీటిలో కొట్టుకుపోయిన సందర్భాలు ఉన్నాయి. లోలెవెల్ కల్వర్టుల స్థానంలో వంతెనలు నిర్మించాలని పలుమార్లు ప్రజలు విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదు. వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు మొదలు పెట్టనివి కొన్ని అయితే.. నిధులు మంజూరు కానివి మరి కొన్ని ఉన్నాయి. దీంతో ఏటా వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

తీరని కష్టాలు...: గతేడాది జులైలో కురిసిన వర్షాలతో.. తొర్రూరు మండలం కంఠాయపాలెంలో పెద్దచెరువు అలుగు దాటుతుండగా గ్రామానికి చెందిన పల్లె యాకయ్యగౌడ్ మృత్యువాత పడ్డాడు. కంఠాయపాలెం– గుర్తూరు గ్రామాల మధ్య వారం రోజులపాటు రాకపోకలు నిలిచిపోయాయి. తొర్రూరు– కంఠాయపాలెం, మడిపల్లి–కంఠాయపాలెం, గుర్తూరు–సోమారం గ్రామాల మధ్య, ఫత్తేపురం–చెర్లపాలెం గ్రామాల మధ్యనున్న లోలెవెల్ కల్వర్టులపై వరద ప్రవాహంతో మూడు, నాలుగు రోజుల వరకు రాకపోకలు స్తంభించిపోయాయి. అనుమతి వచ్చినా : మడిపల్లి నుంచి కంఠాయపాలెం వెళ్లే రోడ్డులో కంఠాయపాలెం ప్రభుత్వ ఉన్నతపాఠశాల సమీపంలో, కంఠాయపాలెం నుంచి గుర్తూరు వెళ్లే రోడ్డులో చెరువు అలుగు వద్ద, గుర్తూరు సమీపంలో మరో వంతెన, ఫత్తేపురం నుంచి చెర్లపాలెంకు వెళ్లేదారిలో, చీకటాయపాలెం నుంచి హరిపిరాలకు వెళ్లే దారిలో చెరువు మత్తడి వద్ద, పెద్దవంగర మండలంలో చిట్యాల నుంచి కర్రెశక్రుతండాకు వెళ్లేదారిలో వంతెనల నిర్మాణానికి గతంలో పంచాయతీ రాజ్ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇటీవల నిర్మాణానికి అనుమతులు వచ్చాయి. జీవోల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో ఈ వర్షాకాలంలో సైతం ఆ ప్రాంత ప్రజలకు తిప్పలు తప్పడం లేదు.జీవో వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం– సురేష్, పీఆర్ ఏఈతొర్రూరు, పెద్దవంగర మండలాల్లో ఆరుచోట్ల వంతెనల నిర్మాణానికి ఉన్నతాధికారులకు గతేడాది ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల నిర్మాణాలకు అనుమతులు వచ్చాయి. జీవో కోసం ఎదురుచూస్తున్నాం. జీవో వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తాం. వర్షాలు కురిసే సమయంలో వాగులు, లోలెవెల్ కల్వర్టుల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

## హామీల శిథిలాలపై మెగా లెదర్ పార్కు..!

వరంగల్ : ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న స్టేషన్ ఘన్‌పూర్ మెగా లెదర్ పార్కు ఏర్పాటు కలగానే మిగిలిపోతోంది. 2002లో నెమలిగుండ గ్రామ శివారులోని 25 ఎకరాల ప్రభుత్వ భూమిలో మినీ లెదర్ పార్కు ఏర్పాటుకు అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం అంకురార్పణ చేసింది. రూ.కోట్లు వెచ్చించి పరిశ్రమకు సంబంధించిన భవనం నిర్మించారు. చెప్పులు, బూట్ల తయారీ శిక్షణ కోసం 80 మందిని ఎంపిక చేసి వారిలో 40 మంది చొప్పన చెన్నై, హైదరాబాద్‌కు పంపించారు. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రెండు వేల మందికి ఉపాధి కల్పించేలా మెగా లెదర్ పార్కును



ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి స్థానిక ప్రజాప్రతినిధులు ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సైతం సానుకూలంగా స్పందించినా ఇప్పటికీ అడుగు పడలేదు. కనీసం భూసేకరణ కూడా చేయలేదని స్థానికులు వాపోతున్నారు. పరిశ్రమ కోసం నిర్మించిన భవనం ఉపయోగించకపోవడంతో శిథిలావస్థకు చేరింది. తమకు ఉపాధి లభిస్తుందని ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని శిక్షణ పొందిన యువకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## యంత్రాలు మూలకు నెట్టేసి..!

వరంగల్ : కేఎంసీలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో పేద రోగులకు పూర్తి ఉచితంగా అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడానికి లక్షలాది రూపాయలతో కొనుగోలు చేసిన ఆధునిక యంత్రాలు ఎందుకూ పనికి రాకుండా పోతున్నాయి. అవసరమైన టెక్నీషియన్లు ఉన్నా.. వాటిని వినియోగించని ఫలితంగా పేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి పరీక్షకు ఇక్కడ నుంచి నమూనాలు సేకరించి ఎంజీఎం ఆసుపత్రికి పంపించడం వల్ల నిర్ధారణ నివేదికలు రావడానికి ఆలస్యమవుతోంది. అక్కడ ఆసుపత్రిలోనూ



1300 పడకల్లో రోగులకు, ఓపీ రోగులకు పరీక్షలు చేయడానికే సిబ్బందికి కాలం సరిపోతోంది. వారికున్న పని ఒత్తిడికి తోడు ఇక్కడ నుంచి రోజూ 30కిపైగా శాంపిల్స్ వస్తుండటంతో పరీక్షించడానికి ఆలస్యమవుతోంది. కేఎంసీ ఆసుపత్రిలో శస్త్రచికిత్సలకు ముందు రక్తం, సిరం, ప్లాస్మా, సెరిబ్రోస్పానియల్ ఫ్లూయిడ్, మూత్ర నమూనాలు, సాధారణ బయోకెమిస్ట్రీ, హార్మోన్ల పరీక్ష, ఎలక్ట్రోలైట్లు, కిడ్నీ, కాలేయ, థైరాయిడ్‌కు సంబంధించిన టీ3, టీ4, థెరప్యూటిక్ డ్రగ్స్, డ్రగ్ ఎంజైమ్‌లకు సంబంధించిన విశ్లేషణ, నిర్ధారణ పరీక్షలు యాంత్రిక పద్ధతిలో నిర్వహించడానికి ప్రభుత్వం సంవత్సరం కిందట ఒక ఫుల్లీ ఆటోమేటిక్, 4 సెమీ ఆటోమేటిక్ ఎనలైజర్లను కొనుగోలు చేసింది. ఇవి వచ్చి సంవత్సరమైనా ఇప్పటివరకు వాటిని తెరవలేదు. రోగ నిర్ధారణ పరీక్షలు చేయడానికి కేఎంసీ ఆసుపత్రిలో ప్రత్యేక ల్యాబు ఉంది. సుమారు 16 మంది టెక్నీషియన్లు ఉన్నా పరీక్షలు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికారులు స్పందించి కేఎంసీలోనే అన్ని రకాల రోగ నిర్ధారణ పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకోవాలని రోగులు, వారి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

## సమయం లేదు కార్మికా..!

సూర్యాపేట :ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డు ఉన్న కూలీలకు ఆధార్ అనుసంధానించే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందుకు సంబంధించిన గడువు ముగియనుంది. దీంతో సిబ్బంది ఉరుకులు పరుగులపై కూలీల నుంచి ఆధార్ సేకరిస్తున్నారు. మరోవైపు ప్రతి మండలం నుంచి ఏపీవో, ఈసీ, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు కలెక్టరేట్లో ఉండి అనుసంధాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇద్దరు, ముగ్గురు టెక్నికల్ సిబ్బంది అనుసంధానం చేస్తున్నారు. నెల రోజుల క్రితమే ఆధార్ అనుసంధానం ప్రారంభించాలని, ఆధార్ సేకరించాలని చెప్పినా అంతగా పట్టించుకోలేదు. ప్రక్రియ నత్తనడకన సాగుతుండటంతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఉన్నతాధికారులు సోమవారానికి గడువు విధించారు.

ప్రక్రియ ఇలా..

ఇక నుంచి ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీల జాబ్‌కార్డుకు ఆధార్ అనుసంధానమైతేనే చేసిన పనికి వేతనం పడుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటి వరకు నేరుగా బ్యాంకు ఖాతాలో జమయ్యేవి. కొత్తగా కేంద్రం పరిధిలోకి వెళ్లిన తర్వాత పలు మార్పులు తీసుకువచ్చారు. జాబ్‌కార్డుకు, బ్యాంకు ఖాతాకు ఆధార్ అనుసంధానమై ఉండాలని అపుడే నగదు చెల్లింపు ఉంటుందని సూచించారు. ఆధార్‌కు ఏ బ్యాంకు ఖాతా లింకై ఉందో ఆ ఖాతాలోనే జమవుతాయి. దీంతో క్షేత్రస్థాయి సిబ్బంది జాబ్‌కార్డు ఉన్నవారి ఇంటి వద్దకు వెళ్లి ఆధార్‌కార్డు నకలు ప్రతులు సేకరిస్తున్నారు. ఇప్పటికే 95 శాతం ఆధార్ సేకరణ పూర్తయిందని, చివరి దశ వెరిఫికేషన్ ప్రక్రియ చేయాల్సి ఉందని అధికారులు తెలిపారు. ముందుగా జాబ్‌కార్డుదారుని ఆధార్‌ను కార్డుకు అనుసంధానిస్తారు. తర్వాత పూర్తి వెరిఫికేషన్ చేసి రెండు సరిగా ఉన్నాయో లేదో సరిచూసుకుని సేవ్ చేస్తారు. దీంతో ప్రక్రియ పూర్తవుతుంది.వేగవంతం..మండల స్థాయిలో క్షేత్రస్థాయి సిబ్బంది ఆధార్ సేకరించి వారి యాప్ ద్వారా కలెక్టరేట్లో ఉన్న సిబ్బందికి, మండల పరిషత్‌లో ఉన్న సిబ్బందికి ఇస్తున్నారు. వారంతా అనుసంధాన ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. లక్ష్యం చేరుకునేందుకు ఏపీవో నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు బిజీగా ఉన్నారు.

# దవాఖానాలకు తరలిస్తూ... కాన్పులు చేస్తూ...




వరంగల్ : ప్రసవ సమయంలో పురిటినొప్పులకు గర్భిణులు విలవిలలాడుతారు. కాబోయే అమ్మలకు అండగా ఉంటూ సమయానికి ఆసుపత్రులకు తీసుకెళ్తున్నారు 108 సిబ్బంది. అత్యవసర సమయంలో వాహనంలోనే కాన్పులు చేస్తున్నారంటే అతిశయోక్తి కాదు. వైద్య సేవలు అందుబాటులో లేని గ్రామీణ ప్రాంతాల వారికి వీరు అండగా ఉంటున్నారు. కొన్ని రహదారులు అధ్వానంగా ఉన్నప్పటికీ అంబులెన్స్ నడిపిస్తూనే సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నేటికీ సరైన రోడ్లు లేవు. అటువంటి ప్రాంతాల వారు ఇంటి ప్రసవాలకే ప్రాధాన్యం ఇస్తున్నవారు లేకపోలేదు. అయితే మారుతున్న పరిస్థితుల కారణంగా వారిలో మార్పులొచ్చాయి. ఆసుపత్రిలో ప్రసవాలు జరిగేలా చూస్తున్నారు. అలాంటి వారికి 108 వాహనం ఆపద్బంధుగా నిలుస్తోంది. అత్యవసర, తప్పనిసరి పరిస్థితుల్లో చాలా మంది గర్భిణులు వాహనంలోనే బిడ్డలకు జన్మనిచ్చారు. 108 వాహనంలో పని చేసే ఈఎంటీలు (ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్) విశేష సేవలు అందిస్తున్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో ఎలాంటి సమయంలోనైనా ప్రసవాలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ తల్లీబిడ్డలను కాపాడుతున్నారు. ఆ తర్వాత ఆసుపత్రికి సురక్షితంగా తరలించి మరింత మెరుగైన వైద్యం అందే విధంగా చూస్తున్నారు. గర్భిణులకే కాకుండా ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడేవారికి తమదైన శైలిలో సేవలు అందిస్తూ ప్రజల ఆదరణ పొందుతున్నారు.

చాలా అప్రమత్తంగా ఉంటాం..

చైతన్య, ఈఎంటీ, హనుమకొండనేను గత 9 ఏళ్లుగా 108 వాహనంలో ఈఎంటీగా విధులు నిర్వహిస్తున్నాను. వివిధ రకాల కేసులను స్వయంగా చూశాను. ప్రమాదంలో గాయపడిన వారు, గుండెపోటు, ఇతర సమస్యలతో అత్యవసరమైన వారిని ఎందరినో చూశాను. నేను పని చేసే వాహనంలో 28 మంది గర్భిణులు ప్రసవించారు. అలాంటి వారిని తీసుకెళ్లే క్రమంలో ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ప్రతి నిమిషం వారిని పరీక్షించాల్సి ఉంటుంది. పురిటినొప్పులు ఎక్కువైతే మార్గ మధ్యలోనే ప్రసవాలు చేసిన సందర్భాలు ఉన్నాయి. క్లిష్ట సమయాల్లో సేవలు అందిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉంది.

తల్లీబిడ్డలను క్షేమంగా ఉంచడమే మా కర్తవ్యం

సుజాత, ఈఎంటీ, భూపాలపల్లి

నేను 2008 సంవత్సరం నుంచి 108 వాహనంలో సేవలు అందిస్తున్నా. వాహనంలో గర్భిణులను తీసుకెళ్లే క్రమంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటాం. వారికి తగిన సలహాలు, సూచనలు ఇస్తాం. భయపడాల్సిన సమయం వచ్చినా వారికి ధైర్యాన్ని చెబుతాం. మేము శిక్షణలో నేర్చుకున్న ప్రకారం ప్రసవ వేదన తీర్చడానికి తగిన చర్యలు తీసుకుంటాం. 30 ప్రసవాలు అంబులెన్స్‌లోనే చేసి క్షేమంగా ఆసుపత్రులకు తరలించాం. ఆయా కుటుంబాలు మాకు కృతజ్ఞతలు చెబుతుంటే పట్టలేని ఆనందం ఉంటుంది. ఒక మంచి పని చేశామనే సంతృప్తి కలుగుతుంది.

ఐదేళ్లలో 1480 ప్రసవాలు జరిగాయి

శివకుమార్, 108 ప్రోగ్రాం అధికారి ఉమ్మడి వరంగల్ జిల్లా

108 వాహనాల్లో అనేక రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి సేవలు అందిస్తున్నాం. అంబులెన్స్ అందించిన సేవల్లో దాదాపు 20 శాతం ప్రసవాల కేసులే ఉన్నాయి. సమయానికి చేరాల్సిన చోటుకు చేరుకొని అవసరమైన వారికి ప్రథమ చికిత్స అందిస్తారు. ఎటువంటి కేసులకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయాలపై సిబ్బందికి ఎప్పటికప్పుడు నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తాం. వేల మందిని వారు క్షేమంగా ఆసుపత్రులకు తరలించారు. అత్యవసర సేవలు అందిస్తూ వేలాది మంది ప్రాణాలను రక్షించడంలో సిబ్బంది సేవలు మరువలేనివి.

# శిరస్త్రాణం.. రక్షణాస్త్రం!!

వరంగల్ : చాలా మంది ఇంటి నుంచి బయటకు వచ్చే సమయంలో హెల్మెట్‌ను వెంట తెచ్చుకుంటున్నారు. వాటిని బండికి తగిలించుకొని వెళ్తున్నారు. పోలీసులు తనిఖీలు చేస్తున్నారని తెలిస్తేనే ధరిస్తున్నారు. లేదంటే అంతే. దీని వలన ఉపయోగం లేదు.

విధించిన ఈ-చలాన్లు

జరిమానా(రూ.)

ట్రాఫిక్ ఠాణాల పరిధిలో గతేడాదిలో హెల్మెట్ ఉల్లంఘనలు..

హనుమకొండ: 3,58,929 6,41,16,600

వరంగల్ : 2,69,437 4,75,12,500

కాజీపేట : 2,87,966 5,11,79,100

ప్రాణం కంటే విలువైనది ఏదీ లేదు. ఇంటి పెద్ద, చేతికొచ్చిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబం పడే వేదన వర్ణనాతీతం. ద్విచక్రవాహనం నడిపే వారు జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా శిరస్త్రాణం ధరించాలి. ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో ప్రాణాపాయం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది. హెల్మెట్ ధరించడం భారంగా అనుకోవద్దు.. బాధ్యతగా భావించాలి. కుర్రకారు రయ్‌మని దూసుకుపోతున్నారు. కొంత మంది శిరస్త్రాణాన్ని భారంగా భావిస్తున్నారు. జుట్టు ఊడిపోతుందని, ముఖం పాలిపోతుందని అనుకొని ధరించడం మానేశారు. జరిమానాల నుంచి తప్పించుకోవడానికి నెంబర్ ప్లేట్లు లేకుండా, ఉన్న వాటిని కనిపించకుండా చేస్తున్నారే తప్ప హెల్మెట్ ధరిద్దామని ఆలోచన చేయడం లేదు.వరంగల్ కమిషనరేట్ పరిధిలో జరుగుతున్న ద్విచక్రవాహనాల ప్రమాదాల్లో 60 శాతం మృతి చెందుతున్నారని పోలీసుల నివేదికలు చెబుతున్నాయి. గతంలో వాహనదారులకు పోలీసులు అవగాహన కల్పించారు. చిన్నపిల్లలతో పుష్పాలు ఇప్పించి.. ధరించమని చెప్పించారు. డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే నష్టాలను సైతం వివరించారు.అయినా కొంతమంది మాత్రం ధరించడం లేదు. గతేడాది హనుమకొండ, వరంగల్, కాజీపేట ట్రాఫిక్ ఠాణాల పరిధిలో హెల్మెట్లు లేకుండా తిరుగుతున్న 9,16,332 మందికి ఈ-చలాన్లు ద్వారా రూ.16.28 కోట్ల జరిమానా విధించారు. పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

తలకు గాయమైతే..శరీరంలో కీలకమైనది మెదడు. ఇది ఇచ్చే సంకేతాలతోనే అవయవాలు పనిచేస్తుంటాయి. మెదడు కణజాలంతో కూడిన పొరతో కప్పబడి ఉంటుంది. దానిపై రక్షణగా పుర్రె ఉంటుంది. ప్రమాదంలో మెదడుకు గాయమైతే జీవితంలో అన్ని కోల్పోవాల్సి వస్తుంది. తలకు గాయాలు కాకుండా చూసుకోవాలి.

స్వల్ప గాయాలతో బయటపడ్డా

దామోదర్‌రెడ్డి గోపాల్‌పూర్

నెల రోజుల క్రితం రాత్రి పూట వ్యక్తిగత పనిపై బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నా. గోపాల్‌పూర్ ప్రధాన రోడ్డుపై ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి డివైడర్‌ను ఢీకొట్టడంతో కింద పడ్డాను. హెల్మెట్ ఉండడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాను. అదే లేకుంటే తలకు బలమైన గాయమయ్యేది.

చాలా సురక్షితం

శ్రీధర్, హనుమకొండ

హెల్మెట్ ఉపయోగం తెలుసుకొని ధరిస్తున్నా. ఈనెల 8వ తేదీన రోడ్డు ప్రమాదం జరిగింది. అప్పుడు తల రోడ్డుకు తాకింది. కానీ ఏమీకాలేదు. చేతులు, కాళ్లకు దెబ్బలు తగిలాయి. హెల్మెట్ లేకుంటే తలకు గాయం అయ్యేది.

నాణ్యమైనవి కొనుగోలు చేయాలి

మధుసూదన్, ట్రాఫిక్ ఏసీపీ

వాహనదారులు నాణ్యమైన హెల్మెట్‌ను వాడాలి. దీని వల్ల తలకు పూర్తి రక్షణ లభిస్తుంది. ప్రమాదం జరిగిన సమయంలో స్వల్ప గాయాలతో బయటపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఈ విషయమై చాలా సార్లు వాహనదారులకు అవగాహన కల్పించాం. ఈ చలాన్లు విధిస్తున్నాం. అయినా కొందరిలో మార్పు రావడం లేదు. ఇలాంటి వారికి కుటుంబ సభ్యులే చెబితే మంచిగా ఉంటుంది.

గతేడాది ద్విచక్ర వాహన ప్రమాదాలు: 390

గాయపడిన వారు: 536

మృతులు: 218

# సమాధానం చెప్పరట!

వరంగల్ :ప్రభుత్వ కార్యాలయాలు ప్రజల కోసం ఏర్పాటు చేస్తారు. అధికారులు, ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి. వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ కుడాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఏదైనా సమాచారం కోసం వస్తే ఎవరిని సంప్రదించాలి? ఎలా పరిష్కరించుకోవాలని చెప్పేవారే లేరు. అడిగిన వారిపై కస్సుబుస్సుమంటున్నారు. కుడా ప్రభుత్వ కార్యాలయమా లేక ప్రైవేటు కార్యాలయమా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్రంలో హైదరాబాద్ మహా నగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) ద్వారా వరంగల్ కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) పరిధి పెద్దది. సుమారు 30 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ప్రజలు చెల్లించే పన్నుల సొమ్మునే నెలనెలా జీతాలుగా తీసుకుంటున్న సిబ్బందికి జవాబుదారీతనం పూర్తిగా లోపించింది. ప్రణాళిక, ఇంజినీరింగ్, ఉద్యాన విభాగాల పనితీరుపై చాలా ఫిర్యాదులున్నాయి. అధికారులపై ఫిర్యాదులు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారులు, ఉద్యోగులు పనిచేయకపోతే ఎవరికి చెప్పుకోవాలి? వైస్ ఛైర్మన్ ప్రావీణ్య ఎప్పుడొస్తారో.. ఎప్పుడెళ్తారో తెలియదు. ప్రజల తరఫున మాట్లాడాల్సిన పాలకవర్గం ప్రతినిధులు పట్టించుకోరని సామాజిక కార్యకర్తలు వాపోతున్నారు. అధికారులు, ఉద్యోగులు 30 ఏళ్లుగా ఇక్కడే పాతుకుపోయారు. బదిలీలు లేకపోవడంతో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. హనుమకొండ జిల్లా కలెక్టర్ దృష్టి సారించాలని కోరుతున్నారు.

ఇవిగో సాక్ష్యాలు ఐదు రోజుల క్రితం వరంగల్ ప్రాంతానికి చెందిన లైసెన్స్‌డ్ సర్వేయర్ ఎనుమాములలో వరంగల్ నూతన మాస్టర్‌ప్లాన్‌లో రోడ్డు ఉందా? లేదా? అని అడిగేందుకు వెళ్లాడు. బాధ్యత కలిగిన జూనియర్ ప్లానింగ్ అధికారి(జేపీవో) నన్ను సమాచారం అడుగుతావా? అంటూ సర్వేయర్ వీరంగం వేశారు. గతంలో కూడా జేపీవో దురుసుగా ప్రవర్తించిన సందర్భాలున్నాయి. సమాచారం అడిగితే బెదిరిస్తారా? అనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నెల రోజుల క్రితం ఓ న్యాయవాది భీమారం లేఅవుట్ వివరాలడిగితే మరో అదనపు ప్లానింగ్ అధికారి(ఏపీవో) ఇవ్వలేదు. పైగా దస్త్రం దొరకడం లేదని తప్పించుకున్నారు.

హంటర్‌రోడ్ ప్రాంతానికి చెందిన ఓ మహిళ ఎల్ఆర్ఎస్ కోసం వెళ్తే ప్రణాళిక విభాగం అధికారులు ఆర్నెల్లుగా తిప్పించుకుంటున్నారు. ఇంజినీరింగ్, ఉద్యాన విభాగాల్లో టెండర్లు, ఒప్పందాలు గోప్యంగా ఉంచుతారు. ఎవరైనా సమాచారం అడిగితే లేదంటారు. ఎల్ఆర్ఎస్ మాన్యువల్ అర్జీల పరిష్కారం కొనసాగుతోంది. సందేహాల నివృత్తి కోసం ప్రజలు వెళ్తే ప్రణాళిక విభాగంలో సమాధానం ఇవ్వడం లేదు.

## వ్యాపారాలే అక్కడ.. వాహనం నిలిపేదెక్కడ?

సూర్యాపేట : పురపాలికల్లోని సెల్లార్ల నిర్వాహకులు నిబంధనలు విస్మరిస్తున్నారు. ఇష్టారాజ్యంగా సెల్లార్లను వినియోగించుకొని నిబంధనలకు పాతరేస్తున్నారు. షాపింగ్ మాల్స్ నిర్వహించేవారు కొనుగోలుదారుల వాహనాలను సెల్లార్లలో నిలుపుకొనే వెసులుబాటు కల్పించాలి. కానీ ఉమ్మడి జిల్లాలో ఎక్కడా యజమానులు అవేమీ పట్టంచుకోవడం లేదు. ఎలక్ట్రానిక్స్, దుస్తులు, మెకానిక్ తదితర వాటికి ఉపయోగిస్తున్నారు. ఆసుపత్రి నిర్వాహకులు మాత్రం ల్యాబ్‌లు, ఆపరేషన్ థియేటర్లకు వాడుకుంటున్నారు. వివిధ అవసరాల నిమిత్తం వచ్చిన వారు మాత్రం తమ వాహనాలను ఆరుబయటనే నిలుపుతున్నారు.పరిస్థితి ఇలా..ఉమ్మడి జిల్లాలో 128 భవనాలకు సెల్లార్లు ఉన్నాయి. భువనగిరిలో సెల్లార్లను పార్కింగ్‌కు కాకుండా వ్యాపారాలకు అద్దెకు ఇచ్చారని గుర్తించిన పుర అధికారులు నోటీసులు జారీ చేశారు. కానీ చర్యలు మాత్రం తీసుకోలేదు. నల్గొండలోనూ సెల్లార్లలో పలు వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. గతంలో రెండు, మూడుసార్లు మున్సిపల్ అధికారులు నోటీసులు కూడా జారీ చేశారు. మిర్యాలగూడలోని సెల్లార్లలో నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు, దుకాణాలు నిర్వహిస్తున్నారు. చిట్యాలలోనూ వాటిలో దుకాణాల నిర్వహణ చేపడుతున్నారు. గతంలో వర్షాలు కురిసి ఇక్కడి సెల్లార్లలోకి నీళ్లు వచ్చాయి కూడా. యజమానులే సొంతంగా నీటిని తోడి పోసుకోవాలని పుర అధికారులు నోటీసులు జారీచేశారు. చౌటుప్పల్‌లో 10కి పైగా సెల్లార్లు ఉన్నాయి. శివారులో ఉండటంతో చెరువు నిండిన సమయంలో



అలుగు పారి సెల్లార్లు మునిగిపోతున్నాయి. సెల్లార్లు పూడ్చి వేయాలని మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. కానీ ఎలాంటి స్పందన లేదు. సూర్యాపేటలో, కోదాడలో కూడా సెల్లార్లలో వాహనాలను నిలపడం లేదు. కొంతమంది సెల్లార్ల నిర్వాహకులు సామగ్రి ఉంచి తాళం వేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు

సెల్లార్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా.. సంబంధిత అధికారులు అడుగు ముందుకు వేయడం లేదు. నిర్మాణ సమయంలో అధికారులకు మామూళ్లు ఇవ్వడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో వారు ఆడిందే ఆట..పాడిందే పాటగా వినియోగిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పురపాలికల్లో సెల్లార్ల వివరాలు

భువనగిరి 6 నల్గొండ 50మిర్యాలగూడ 28చిట్యాల 3 చౌటుప్పల్ 10సూర్యాపేట 19కోదాడ 12నిబంధనలు పాటించకుంటే చర్యలు-రామాంజులరెడ్డి, మున్సిపల్ కమిషనర్, సూర్యాపేట

పురపాలికల్లో సెల్లార్ల నిర్వాహకులు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవు. సెల్లార్లను వాహనాల పార్కింగ్‌కే వినియోగించాలి. ఇతర వాటికి వినియోగిస్తే నిబంధనల చర్యలు చేపట్టాల్సి వస్తుంది. ఇక నుంచి ఎప్పటికప్పుడు తనిఖీ చేసి ఇబ్బందులు లేకుండా చూస్తాం.

## హరితహారం మొక్క.. బతికేది ఎట్లా?

కోదాడ : హరితహారంలో భాగంగా కోదాడలోని జాతీయ రహదారి వెంబడి నాటిన మొక్కలను వాహనదారులు టైర్లతో తొక్కించడంతో మొక్కలు ఎండిపోయాయి. ఈ చిత్రంలో గమనిస్తే వాహనాలు నిలిచి ఉన్న ప్రాంతంలో గతంలో మొక్కలు నాటారు. కానీ వాహనాలను నిలిపి ఉంచేందుకు రహదారి వెంబడి నాటిన మొక్కలను తొక్కడంతో అవి కనమరుగై పోయాయి. వీటిని సంరక్షించాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఇది ఒక్క కోదాడ పట్టణంలోనే కాదు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాగే కొనసాగుతోంది.

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారం పథకం అమలు తీరు గందరగోళంగా తయారైంది. రూ.కోట్లల్లో నిధులు వెచ్చించి నాటిన మొక్కలు ఆదిలోనే అంతమవుతున్నాయి. ప్రభుత్వం నిర్దేశించిన లెక్కలో మాత్రం మొక్కలు నాటామని చెబుతున్న అధికారులు క్షేత్రస్థాయిలో వాటి సంరక్షణకు తగిన పని తీరు కనబరచడంలేదు. ఫలితంగా ఎనిమిదేళ్ల నుంచి పథకం అమలవుతున్నా.. నేటికీ మొక్కలు పెరగని పరిస్థితి.

కొరవడిన పర్యవేక్షణ

ప్రభుత్వం హరితహారం కార్యక్రమం నిర్వహించేటప్పుడు మాత్రమే అధికారుల హడావుడి ఉంటుంది. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణను గాలికొదిలేస్తున్నారు. నాటిన మొక్కలకు ట్రీ గార్డులు



తొడగకపోవడంతో కొన్ని మొక్కలు చనిపోతున్నాయి. మొక్కలకు నిత్యం నీళ్లు పోయకపోవడం, రహదారి వెంబడి పశువులు మేయడం, వాహనాలు తొక్కడంతో నాటిన నాలుగు నెలల్లోనే నేటలకొరుగుతు న్నాయి. మొక్కల సంరక్షణ కోసం అధికారులు ఎక్కడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం లేదు. వాటిని ఉద్దేశపూర్వకంగా తొలగించినా వారిపై చర్యలు తీసుకోవడం లేదు. దీంతో కొన్నేళ్లుగా మొక్కలు నాటుతూనే ఉన్నా అవి చనిపోతూనే ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని మొక్కల సంరక్షణపై దృష్టి సారిస్తే ప్రజా ధనం వృథా కాదని స్థానికులు కోరుతున్నారు.

మొక్కలు తొలగిస్తే కఠిన చర్యలు

- డి.మహేశ్వర్‌రెడ్డి, పుర కమిషనర్, కోదాడ

హరితహారంలో నాటిన మొక్కలను ఉద్దేశపూర్వకంగా తొలగిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. మొక్కలు లేని చోట వాహనదారులు తమ వాహనాన్ని నిలుపుకోవాలి. మొక్కలు తొలగిస్తే మా దృష్టికి తీసుకురండి. మొక్కలు బతికించేందుకు అందరి సహకారం కావాలి.




మదనపల్లె గ్రామీణం: మదనపల్లె మార్కెట్‌లో గత ఐదు రోజులగా టమాటా ధరలు తగ్గుముఖం పట్టాయి. నిన్నటి వరకు మార్కెట్‌కు 300 టన్నులు టమాటాలు రాగా.. శుక్రవారం 400 టన్నులకుపైగా సరకును రైతులు తీసుకువచ్చారు.

దీంతో ఏ గ్రేడు టమాటాలు కిలో రూ.30 నుంచి రూ.40 వరకు, బీ గ్రేడు రూ.21 నుంచి రూ.28 వరకు పలికింది. సగటున కిలో టమాటా రూ.26 నుంచి రూ.37 వరకు వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్‌యార్డు కార్యదర్శి అభిలాష్ తెలిపారు. మదనపల్లె మార్కెట్‌లో ఏ గ్రేడ్ కిలో టమాటా రూ.50 నుంచి రూ.64 వరకు, బీ గ్రేడ్ రూ.36 నుంచి రూ.48 వరకు పలికింది. ప్రస్తుతం అనంతపురం జిల్లాతో పాటు కర్ణాటకలోని కోలార్ పరిధిలో టమాటా దిగుబడులు పెరిగాయని.. ఆ ప్రభావంతోనే తాజాగా ధరలు మరింత తగ్గుముఖం పట్టినట్లు అధికారులు వెల్లడించారు.

## చెప్పింది యథాతథంగా రికార్డ్ చేయలేదు.. దర్యాప్తు వెనుక దురుద్దేశం ఉందన్న అజేయ కల్లాం

హైదరాబాద్ : వైఎస్ వివేకా హత్య కేసులో భాస్కర్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి బెయిల్ పిటిషన్ పై నేడు విచారణ జరిగింది. కౌంటర్ దాఖలు చేయాలని సిబీఐకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్ట్ 18 కి వాయిదా వేసింది. మాజీ ఐఏఎస్ అజయ కల్లాం వేసిన పిటిషన్ పై హైకోర్టులో విచారణ జరిగింది. 161 సీఆర్పీసీ నోటీస్ ఇవ్వలేదని అజేయ కల్లాం తరుపు న్యాయవాది వాదించారు. మెసేజ్ చేసి సీబీఐ విచారణకు పిలిచారు. తన స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసింది వికాస్ సింగ్ అని.. అయితే తన స్టేట్‌మెంట్‌పై సంతకం ముఖేష్ శర్మది ఉందని అజేయ కల్లాం కోర్టుకు తెలిపారు. సీనియర్ ఐపీఎస్‌లు అయి ఉండి ప్రొసీజర్ ఫాలో కాలేదన్నారు. తాను చెప్పింది యదాతథంగా రికార్డు చేయలేదని... దర్యాప్తు వెనుక దురుద్దేశం ఉందన్నారు. సీబీఐ చార్జిషీట్‌లో తన స్టేట్మెంట్





తొలగించాలన్నారు. తిరిగి తన స్టేట్మెంట్ రికార్డు చేయాలన్నారు. అజేయ కల్లం తరుపు న్యాయవాదుల వాదనలు ముగిశాయి. పిటిషన్ విచారణ అర్హతపై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది.

## పుంగనూరు ఘటనలో దేవినేని, నల్లారికి హైకోర్టులో ఊరట

అమరావతి: చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గం అంగళ్లులో జరిగిన సంఘటనలో టీడీపీ నేతలు దేవినేని ఉమ, నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిలకు సోమవారం వరకు హైకోర్టులో ఊరట లభించింది. వీరిరువురి ముందస్తు బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయగా.. ఈరోజు విచారణ జరిగింది.

పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాదులు పోసాని వెంకటేశ్వర్లు, ఎస్వీ సుమంత్ వాదనలు వినిపించారు. తమకు వివరాలు అందించేందుకు సోమవారం వరకు సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది కోరారు. సోమవారం వరకు అరెస్ట్ చేయబోమని అడిషనల్



అడ్వకేట్ జనరల్ కోర్టుకు తెలిపారు. దీంతో కేసు తదుపరి విచారణను హైకోర్టు ఈనెల 14కు వాయిదా వేసింది.

## ఇడుపులపాయలో అలా చేస్తే.. జగన్‌కు ఇంతకంటే దౌర్భాగ్య పరిస్థితి ఉండదు: బీటెక్ రవి



ఇడుపులపాయ: సీఎం జగన్ సొంత ఎస్టేట్ అయిన ఇడుపులపాయ గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవికి తెదేపా మద్దతుదారులు నామినేషన్ వేస్తే.. వైకాపా శ్రేణులు ఎందుకు భయపడుతున్నాయని పులివెందుల తెదేపా ఇంఛార్జి, మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ప్రశ్నించారు. వేంపల్లి ఎంపీడీవో మల్లిఖార్జున రెడ్డి తమ అభ్యర్థికి ధ్రువపత్రాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ మేరకు ఎంపీడీవో, స్థానిక సిబ్బంది వైఖరిపై కడప జడ్పీ సీఈవో సుధాకర్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ సీఎం జగన్ తన సొంత నియోజకవర్గంలోనే సర్పంచ్ ఎన్నికలను ఎదుర్కొనే ధైర్యం లేక అడ్డదారులు వెతుకుతున్నారని ఆరోపించారు. ఇంటి పన్నుల చెల్లింపు, కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాల్సిన అధికారులు తప్పించుకుని తిరుగుతున్నారన్నారు. తమ అభ్యర్థి నామినేషన్‌ను పరిశీలనలోనే తిరస్కరించాలని చూస్తే ఇంతకంటే దౌర్భాగ్య పరిస్థితి జగన్‌కు ఉండదని వ్యాఖ్యానించారు. ఇడుపులపాయ సర్పంచ్ ఎన్నికల్లో తెదేపా గెలుస్తుందన్న భయంతోనే నామినేషన్ తిరస్కరించేందుకు వైకాపా నేతలు పన్నాగం పన్నుతున్నారని ఆయన ఆరోపించారు.

## కేంద్రానికి కాకపోతే.. రష్యాలో పుతిన్‌కు వెళ్లి చెప్పుకో

విశాఖపట్నం: జగన్‌ను మళ్లీ సీఎం చేయవద్దని పవన్ అన్నారని... తనని ముఖ్యమంత్రి చేయమని ఎక్కడా కోరలేదని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. రూ.30 వేల మంది మహిళలు మిస్ అయ్యారని అన్నారని... వలంటీర్ల మీద అవాస్తవాలు మాట్లాడారని మండిపడ్డారు. జగన్ సైన్యం ... వలంటీర్ల వ్యవస్థ అని చెప్పుకొచ్చారు. ముద్రగడ పద్మనాభం కుటుంబ సభ్యులకు వేధిస్తే పవన్ అప్పుడు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో గంజాయి ఎక్కడ ఉందో పవన్‌కే తెలుసన్నారు. గత ప్రభుత్వంలో అక్రమాలపై ఎందుకు పవన్ మాట్లాడలేదని నిలదీశారు. పవన్ కేంద్రంతో చెబుతానని అంటున్నారని.. తమకేమీ భయమని అన్నారు. ఎవరికి భయపడే ప్రభుత్వం జగన్ ది కాదని.. కేంద్రానికి కాకపోతే.. రష్యాలో పుతిన్‌కు వెళ్లి చెప్పుకో అంటూ వ్యాఖ్యలు చేశారు. పవన్‌కు పలుకుబడి ఉంటే.. కేంద్రం దగ్గరికి వెళ్ళి స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలన్నారు. జగన్ ఎవరికీ భయపడే వ్యక్తి కాదని.. సోనియా గాంధీనే జగన్



ఎదిరించారన్నారు. పవన్ ఒక బాబా.. అంటే బాబు గారి బానిస అంటూ విరుచుకుపడ్డారు. హైదారాబాద్‌లో పవన్ కళ్యాణ్ ఇళ్లు కొండ మీదే కట్టుకోలేదా అని అడిగారు. పవన్ విశాఖలో ఇళ్లు కొనుకుంటాననడాన్ని స్వాగతిస్తూన్నామని... ఎవరైనా రాజధానికి రావాల్సిందే అని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు.

## బదిలీల జాబితాలో.. రాహుల్ గాంధీకి స్టే నిరాకరించిన న్యాయమూర్తి

దిల్లీ: పరువు నష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి విధించిన రెండేళ్ల శిక్ష నిలుపుదలకు నిరాకరించిన గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ ప్రచక్ బదిలీ కానున్నారు. బదిలీల నిమిత్తం సుప్రీంకోర్టు కొలీజియం తాజాగా ప్రతిపాదించిన జాబితాలో ఆయన పేరు కూడా ఉంది. ఈ బదిలీలకు సంబంధించిన వివరాలను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. 'మోదీ ఇంటిపేరు'పై చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన పరువునష్టం కేసులో రాహుల్ గాంధీ.. తనకు విధించిన రెండేళ్ల శిక్షను నిలిపివేయాలంటూ వేసిన స్టే పిటిషన్‌ను జులై నెలలో గుజరాత్ హైకోర్టు కొట్టేసింది. 'ఈ కేసులో కిందికోర్టు విధించిన శిక్ష న్యాయపరమైందే. ఈ శిక్షను నిలిపివేసేందుకు ఎలాంటి కారణాలు కన్పించట్లేదు. అందుకే పిటిషనర్ అభ్యర్థనను కొట్టివేస్తున్నాం' అని జస్టిస్ హేమంత్ ప్రచక్ గతంలో తీర్పు వెలువరించారు. 'జస్టిస్ ప్రచక్.. గుజరాత్ హైకోర్టులో న్యాయవాదిగా తన వృత్తి జీవితాన్ని ప్రారంభించినట్లు కొన్ని మీడియా కథనాలు వెల్లడించాయి. తర్వాత గుజరాత్ ప్రభుత్వంలో అసిస్టెంట్ ప్లీడర్‌గా పనిచేశారు. ఆ తర్వాత వివిధ హోదాల్లో పనిచేసిన ఆయన 2021లో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఇక ఆ బదిలీల జాబితాలో



పంజాబ్, హరియాణా హైకోర్టుకు చెందిన నలుగురు న్యాయమూర్తులు, అలహాబాద్ హైకోర్టుకు చెందిన ఒక న్యాయమూర్తి సహా మొత్తం 23 మంది న్యాయమూర్తుల పేర్లు ఉన్నాయి.




## చంద్రబాబు పర్యటనపై నారా లోకేష్ ఆసక్తికర ట్వీట్

అమరావతి : బాబు రావాలి... రాష్ట్రం గెలవాలి అంటూ చంద్రయాన్ పేరుతో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఒక ఆసక్తికర ట్వీట్ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నిర్వహించిన సాగునీటి ప్రాజెక్ట్‌ల విధ్వంసం పై యుద్ధభేరి గ్రాండ్ సక్సెస్ అని ట్వీట్‌లో పేర్కొన్నారు. 10 రోజుల్లో 3 వేల కిలోమీటర్ల చంద్రబాబు పర్యటనపై ట్విటర్ వేదికగా ఓ వీడియోను విడుదల చేశారు. **"చంద్రయాన్!** సాగునీటి ప్రాజెక్టు ల విధ్వంసం పై యుద్ధభేరి గ్రాండ్ సక్సెస్. 10 రోజులు.... 15 ప్రాజెక్టులు..... 20 జిల్లాలు.... 30 నియోజకవర్గాలు... 35 ప్రజెంటేషన్లు, రోడ్ షోలు, బహిరంగ సభలు. 3000 కిలోమీటర్లు.... బెదిరింపులకు భయపడలేదు.... రాళ్ళదాడులను లెక్కలేయలేదు.... జలం కోసం...జనం కోసం.. సాగునీటి కోసం....రైతు బాగుకోసం... నీళ్ల కోసం ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన చంద్రుడు. నాయుడే ప్రజా నాయకుడు! బాబు రావాలి.....రాష్ట్రం గెలవాలి" అంటూ చంద్రయాన్ పేరుతో నారా లోకేష్ వీడియో విడుదల చేశారు.




## తృణమూల్ ఎంపీ మహువా మొయిత్రా స్పష్టీకరణ

దిల్లీ: 'మేం ఇండియా తరఫున అవిశ్వాస తీర్మానం పెట్టింది ఎవరినో దించడానికి కాదు. ఆరు అడుగుల లోతున పాతిపెట్టిన భారతీయ సిద్ధాంతాలు, సమానత్వం, సెక్యులరిజం లాంటి వాటిని వెలికి తీయడానికి. అధికార పార్టీ సభ్యులతోపాటు బిజూ జనతాదళ్, వైకాపా లాంటి మిత్రులు ప్రభుత్వాన్ని పడగొట్టలేరని మమ్మల్ని ఎగతాళి చేయొచ్చు. మాకు సంఖ్యాబలం లేకపోవచ్చు. అయినా ఇండియాపై విశ్వాసం ప్రదర్శించడానికి అవిశ్వాసం పెట్టాం' అని తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా స్పష్టం చేశారు. అవిశ్వాస తీర్మానంపై ఆమె మాట్లాడారు. మణిపుర్ ఘటనను గతంలోని వాటితో పోలుస్తూ ప్రభుత్వాలు మౌనంతో కప్పేశాయని విమర్శించారు. పార్లమెంటులో తరచూ నోరు మూసుకోండనే ప్రధాని ఇప్పుడు మణిపుర్ గవర్నర్‌నూ అలాగే ఆదేశించారని ధ్వజమెత్తారు. మంగళ, బుధవారాల్లో సభ్యుల మాటలను వినడానికి సభకు రాని ప్రధాని తన మాటలను సభ్యులకు వినిపించేందుకు గురువారం వచ్చారని ఎద్దేవా చేశారు. ఆమె మాట్లాడుతుండగా రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌లలో అత్యాచారాల సంగతేంటని అధికార పక్ష సభ్యులు నినాదాలు చేశారు. దీంతో మొయిత్రా హరియాణాను ప్రస్తావించారు. అయితే వీటన్నింటితో పోలిస్తే మణిపుర్ సమస్య విభిన్నమైనదని ఆమె స్పష్టం చేశారు. 'ప్రధాన మంత్రి గారూ.. మీరు వింటున్నారా.. మణిపుర్‌లో పాలనా వ్యవస్థను మార్చండి. పార్టీలు కలిసి పనిచేయడానికి అవకాశమివ్వండి' అని విజ్ఞప్తి చేశారు. ప్రధానిపై భారత్ విశ్వాసం కోల్పోయిందని పేర్కొన్నారు. 37శాతం ఓట్లు వచ్చిన పార్టీ అధికారంలోకి వచ్చి బెదిరిస్తుంటే మిగిలిన 63శాతం మంది ఓట్లున్న పార్టీలుగా భయపడబోమని స్పష్టం చేశారు. ఈసారి అవకాశాన్ని చేజార్చుకోబోమని, గెలిచి తీరుతామని పేర్కొన్నారు.




జనాభా, ఆర్థిక సమస్యలు చైనాను పేలడానికి సిద్ధంగా ఉన్న టైమ్ బాంబులా మార్చేశాయని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ దేశ పరిస్థితి.. మిగిలిన ప్రపంచాన్ని భయపెడుతోందన్నారు. గురువారం యూటాలోని పార్క్‌సిటీలో విరాళాల సేకరణ కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా బైడెన్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనాలో వృద్ధి మందగించిందని.. దీనికి తోడు అక్కడ పనిచేసేవారి కంటే రిటైరైపోయేవారి సంఖ్యే అధికంగా ఉండటం సమస్యాత్మకంగా మారిందని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. "అత్యధిక నిరుద్యోగ రేటు కొనసాగుతోంది. దీంతో వారు కొన్ని సమస్యలు ఎదుర్కొంటున్నారు. అది ఏమాత్రం మంచిది కాదు. సాధారణంగా చెడ్డవారికి సమస్యలుంటే.. వారు మరింత చెడు పనులే చేస్తారు" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. బీజింగ్ చర్యలను వాషింగ్టన్ జాగ్రత్తగా గమనిస్తోందని.. దాంతో పోరును కోరుకోవడంలేదని బైడెన్ వెల్లడించారు. బెల్ట్ అండ్ రోడ్ ప్రాజెక్టును ఆయన ఓ రుణ ఉచ్చుగా అభివర్ణించారు. ఈ ప్రాజెక్టు కింద రుణం పొందాలనుకునే దేశాలు చైనా షరతులను కచ్చితంగా ఆమోదించాల్సి ఉంటుందన్నారు. అమెరికా సంస్థలు చైనాలో టెక్నాలజీ సంస్థల్లో పెట్టుబడులు పెట్టడంపై ఆంక్షలు విధిస్తూ ఈ వారం బైడెన్ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. చైనాతో సంబంధాలను కొంత మెరుగుపర్చుకొనేందుకు విఫల యత్నం చేసిన తర్వాతే ఈ ఉత్తర్వులు జారీ కావడం గమనార్హం. ఇప్పటి వరకు చైనాపై జోబైడెన్ చేసిన అత్యంత తీవ్రమైన వ్యాఖ్యలు ఇవేనని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. దక్షిణ చైనా సముద్రంలో బీజింగ్ దూకుడు, ఆ దేశ మోసపూరిత ఆర్థిక విధానాలపై బైడెన్ కఠిన వైఖరి తీసుకొన్నారని ఈ వ్యాఖ్యలు చెబుతున్నాయి. ఇప్పటికే చైనా ఎగుమతులు పతనమై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న సమయంలో టెక్నాలజీ సంస్థల్లో పెట్టుబడులను అమెరికా నిలిపివేసింది.




అమెరికాలోని హవాయి దీవిలో ఏర్పడిన కార్చిచ్చు పెను నష్టాన్ని మిగిల్చింది. లహైనా రిసార్టు నగరంలో ఈ ప్రకృతి విపత్తు సృష్టించిన బీభత్సం కారణంగా మృతుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ దుర్ఘటనలో ఇప్పటివరకు 53 మంది ప్రాణాలు కోల్పోయినట్లు హవాయి గవర్నర్ జోష్ గ్రీన్ వెల్లడించారు. "అనుమానమే లేదు. లహైనాపై బాంబు పడినట్లుగా ఉంది. ఎటు చూసినా అంతా భస్మీపటలమైన నిర్మాణాలే కన్పిస్తున్నాయి" అంటూ గ్రీన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్చిచ్చు కారణంగా 1000కి పైగా నిర్మాణాలు ధ్వంసమయ్యాయి. అనేక కార్లు, వాహనాలు కాలిబూడిదయ్యాయి. మంగళవారం రాత్రి ఈ కార్చిచ్చు మొదలైంది. హరికేన్ ప్రభావంతో బలమైన గాలులు వీయడంతో మంటలు వేగంగా వ్యాపించాయి. చూస్తుండగానే నివాసాలను చుట్టుముట్టాయి. వీధుల్లో దట్టమైన పొగ అలముకుంది. ప్రజలు భయంతో పరుగులు పెట్టారు. కొందర పొగ, మంటల బారి నుంచి తప్పించుకునేందుకు పసిఫిక్ మహాసముద్రంలోకి దూకారు. రంగంలోకి దిగిన అధికారులు, సహాయక సిబ్బంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇంకా కొందరు శిథిలాల కింద చిక్కుకోగా వారి కోసం గాలిస్తున్నారు. ఇప్పటివరకు 53 మృతదేహాలను గుర్తించగా.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్లు అధికారులు భావిస్తున్నారు. కార్చిచ్చును ఆర్పేందుకు అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. అయినప్పటికీ ఇంకా కొన్ని చోట్ల మంటలు వేగంగా వ్యాపిస్తున్నట్లు హవాయి ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ వెల్లడించింది. ఇంకా ఆస్తి నష్టాన్ని అంచనా వేయలేదు. కానీ, నగరంలో చాలా వరకు నిర్మాణాలు కాలి బూడిదయ్యాయి. హవాయిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో లహైనా కూడా ఒకటి. దీంతో హోటళ్లు, రిసార్టుల సంఖ్య కూడా ఎక్కువే. ఇప్పుడవన్నీ ధ్వంసమయ్యాయని స్థానికులు చెబుతున్నారు.

# ఎద అందాలతో కవ్విస్తున్న ముద్దుగుమ్మ

రొమాంటిక్, లక్ష్య సినిమాలతో హీరోయిన్ గా తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. మొదటి రెండు సినిమాలు నిరాశ పరిచినా కూడా మెగా హీరో వైష్ణవ్ తో కలిసి రంగ రంగ వైభవంగా సినిమాలో నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా కూడా కేతిక కి నిరాశనే మిగిల్చింది. హీరోయిన్ గా కేతికకి 'బ్రో' సినిమాతో మరో ఛాన్స్ దక్కింది. సాయి ధరమ్ తేజ్ కి జోడీగా బ్రో సినిమా లో హీరోయిన్ గా నటించిన కేతిక శర్మ మంచి మార్కులు దక్కించుకుంది. కేతిక నటించిన సినిమాలు వరుసగా ఫ్లాప్ అయినా కూడా లక్కీగా ఆఫర్లు వస్తూనే ఉన్నాయి. తాజాగా మరోసారి



ఈ అమ్మడు యంగ్ హీరోకి జోడీగా నటించే అవకాశం దక్కించుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ అమ్మడు సక్సెస్ లు లేకున్నా ఆఫర్లు దక్కించుకోవడానికి కారణం అందాలతో అలరించడమే అంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉన్నారు. సోషల్ మీడియాలో ఈ అమ్మడి అందాల ఆరబోత ఫోటోలు ఎప్పటికప్పుడు వైరల్ అవుతున్నాయి. తాజాగా మరోసారి తన ఎద అందాలతో కవ్విస్తూ అలరిస్తోంది. ఈ ఫోటోల్లో కవ్వించినట్లుగా చూస్తున్న కేతిక శర్మ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఈ రేంజ్ అందాల ఆరబోత ఈ అమ్మడికే సాధ్యం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఆకట్టుకునే అందాల ఆరబోత ఈ అమ్మడికే సాధ్యం అంటూ తాజాగా మరోసారి ఈ ఫోటోలతో నిరూపితం అయింది.

## ఆఫ్ స్క్రీన్ ప్రభాస్ తో "ఐ విల్ రేప్ యూ" అంటా!

టాలీవుడ్ స్టార్ హీరో డార్లింగ్ ప్రభాస్ ని ఇష్టపడని వారు ఎవరూ ఉండరు. ఇండస్ట్రీలో ప్రతి ఒక్కరితో కలిసిపోయి, ఆప్యాయంగా పిలిచే ప్రభాస్ వ్యక్తిత్వానికి చాలా మంది ఫ్యాన్స్ గా మారిపోతారు. అమ్మాయిలు అయితే ప్రభాస్ కటౌట్ చూడగానే ఫ్లాట్ అయిపోతారు. ప్రస్తుతం పాన్ ఇండియా హీరోగా ఇండియాలోనే హైయెస్ట్ రెమ్యునరేషన్ తీసుకుంటున్న స్టార్ గా ఉన్న కూడా ప్రభాస్ లో డౌన్ టూ ఎర్త్ ఆటిట్యూడ్ ఉంటుంది. అలాగే సెట్ లో ఇతర యాక్టర్స్ కి ఇంటి భోజనం అందించడం ప్రభాస్ ప్రత్యేకత. ప్రత్యేకంగా వంటకాలు చేయించి తీసుకొచ్చి హీరోయిన్ తో పాటు ఇతర స్టార్స్ కి పెడుతూ ఉంటారు. అతను మంచి భోజన ప్రియుడు అని అందరికి తెలిసిందే. ఇండస్ట్రీలో ఉన్న చాలా మంది ఈ జెనరేషన్ అమ్మాయిలకి ప్రభాస్



తో కలిసి నటించాలని కోరిక ఉంటుంది. అలాగే ఫాంటసీలు కూడా ఉంటాయి. ప్రభాస్ లాంటి భర్త కావాలని కోరుకునే వారు ఉంటారు. అయితే ఓ నటి మాత్రం బోల్డ్ స్టేట్ మెంట్ ఇచ్చేసింది. బుట్టబొమ్మ, కొరమీను, రాజా రాజా చోళ సినిమాలలో నటించిన ఇందు కుసుమ తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకుంది. గాలివాన వెబ్ సిరీస్ లో ఈమె కీలక పాత్రలో కనిపించింది. తాజాగా ఈ బ్యూటీ ఓ యుట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ వైరల్ అయ్యాయి. ప్రభాస్ కి చెల్లిగా నటించే అవకాశం వస్తే ఆన్ స్క్రీన్ మీద చేస్తానని, ఆఫ్ స్క్రీన్ మాత్రం "ఐ విల్ రేప్ యూ" అంటా అని బోల్డ్ స్టేట్మెంట్ ఇచ్చేసింది. ఈ మాటలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. దీనిపై నెటిజన్లు భిన్నరకాలుగా రియాక్ట్ అవుతున్నారు. గతంలో సల్మాన్ ఖాన్ రెజ్లర్ సినిమా సమయంలో బోల్డ్ కామెంట్స్ చేశారు. నేను రింగ్ నుంచి బయటకి వెళ్ళినపుడు రేప్ చేయబడిన మహిళ వెళ్తున్నట్లు ఫీల్ అవుతానంటూ అన్నాడు. దీనిపై మహిళా సంఘాలు పెద్ద ఎత్తున విమర్శలు చేశాయి. సల్మాన్ ఖాన్ కి మహిళలంటే చులకన అని కామెంట్స్ చేశాయి. ఇప్పుడు అలాంటి కామెంట్స్ యాక్టర్ కుసుమ కూడా చేసింది. మరి దీనిపై మహిళా సంఘాలకి స్పందించే ధైర్యం ఉందా అంటూ పోస్టులు పెడుతున్నారు.




# ఫ్లాప్స్.. రౌడి ఎంత లైట్ తీసుకున్నాడంటే



విజయ్ దేవరకొండ, సమంత జంటగా నటించిన తాజా చిత్రం ఖుషీ. ఈ మూవీ త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. కాగా, ఈ రోజు ఈ మూవీ ట్రైలర్ లాంఛ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ట్రైలర్ ని తాజాగా విడుదల చేశారు. ట్రైలర్ ఇప్పుడు నెట్టింట ట్రెండింగ్ గా మారింది. అయితే, ఈ ఖుషీ మూవీ పుణ్యమా అని చాలా కాలం తర్వాత విజయ్ దేవర కొండకు మైక్ దొరికింది. నిజానికి లైగర్ మూవీ తర్వాత మీడియాతో మాట్లాడటానికి కూడా ఆయన ఆసక్తి చూపించలేదు. మధ్యలో తన తమ్ముడు బేబీ సినిమా సమయంలో మీడియాతో ఇంటారాక్ట్ అయినా, అది కేవలం ఆ మూవీ గురించి మాత్రమే స్పందించాడు. కాగా, చాలా కాలం తర్వాత ఆయన ఈరోజు తన గత సినిమాల గురించి స్పందించాడు. లైగర్ మూవీ పక్కా హిట్ అవుతుందని చాలా ఆశలుపెట్టుకున్నాడు. పాన్ ఇండియా రేంజ్ గుర్తింపు వస్తుందని అనుకున్నాడు. కానీ, ఆ మూవీ ఫ్లాప్ అవ్వడం గట్టిగానే దెబ్బేసింది. అయితే, ఖుషీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో లైగర్ ఫ్లాప్ అయ్యిందని అంగీకరించాడు. లైగర్ ఆడలేదనే మాట వాస్తవమేనని, తాను అంతకు ముందు పరాజయాలు చూశాను ఇకపై కూడా హిట్లు ఫ్లాపులు చూస్తానని చెప్పడం విశేషం. సినిమా అన్న తర్వాత హిట్, ఫ్లాప్ కామన్ అనే విషయాన్ని చెప్పకనే చెప్పాడు. ఇదిలా ఉండగా, ఖుషీ ట్రైలర్ చూసిన తర్వాత ఇదొక ప్రేమ కథ అనే విషయం స్పష్టంగా అర్థమౌతోంది. అయితే, పాటలు చూసినప్పుడు చాలా మందికి సందేహాలు కలిగాయి. సమంత ముస్లిం లేక, హిందూ నా అని, ఈ విషయంలో ట్రైలర్ లో క్లారిటీ వచ్చింది. పక్కా బ్రాహ్మిణ్ అమ్మాయిని, క్రిస్టియన్ అబ్బాయి ప్రేమించి పెళ్లి చేసుకుంటాడు. తర్వాత ఏమైంది అనేది కథ. వారి పెళ్లికి ఇరు కుటుంబాలు అంగీకరించకున్నా, పెళ్లి చేసుకున్న ఈ జంట ఎలాంటి సమస్యలు ఎదుర్కొందో చూడాలంటే మూవీ చూడాల్సిందే. ఈ ట్రైలర్ చూసిన తర్వాత టూ స్టేట్స్ సినిమా ఛాయలు కొంచెం కనిపించాయి. ఇక, ఈ మూవీని పాన్ ఇండియా లెవల్ లో విడుదల చేస్తున్నారు. ఈ ఈవెంట్ కి కూడా అన్ని భాషల మీడియా వారు రావడం విశేషం. ఇక ఈ ఈవెంట్ కి సమంత వస్తుందని అందరూ ఆశపడ్డారు. కానీ, సమంత లేకుండానే విజయ్, డైరెక్టర్ శివ నిర్వాణ ఈ వెంట్ ని హ్యాండిల్ చేశారు.

# కల్కి కోసం ఆ ఇద్దరు సూపర్ స్టార్స్ వచ్చేశారు




ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో అశ్వినీదత్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్న 'కల్కి' చిత్రం షూటింగ్ కార్యక్రమాలు తిరిగి ప్రారంభం అయ్యాయి. ఆదిపురుష్ సినిమా విడుదలకు ముందు ప్రభాస్ యూఎస్ వెళ్లాడు. దాదాపు 50 రోజుల తర్వాత ప్రభాస్ ఇటీవల ఇండియాకు తిరిగి వచ్చిన విషయం తెల్సిందే. ప్రభాస్ వచ్చిన





వెంటనే 'కల్కి 2898 ఏడీ' షూటింగ్ ను మొదలు పెట్టారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ప్రత్యేకంగా వేసిన సెట్టింగ్ లో ఈ సినిమా చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ సినిమా షూటింగ్ కోసం బాలీవుడ్ మెగాస్టార్ అమితాబచ్చన్ తో పాటు యూనివర్శిల్ స్టార్ కమల్ హాసన్ కూడా హైదరాబాద్ చేరుకున్నట్లు యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. కమల్ హాసన్ చాలా స్పీడ్ గా ఇండియన్ 2 సినిమా షూటింగ్ ను ముగించే పనుల్లో ఉన్నాడు. అయినా కూడా కమల్ 'కల్కి' సినిమా కోసం ఇండియన్ 2 కి బ్రేక్ ఇచ్చాడని సమాచారం అందుతోంది. ఈ షెడ్యూల్ లో ప్రభాస్, అమితాబచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకునే ఇంకా పలువురు ప్రముఖ నటీనటులు పాల్గొంటున్నారు. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలనే పట్టుదలతో దర్శకుడు నాగ్ అశ్విన్ ఉన్నాడు. ఇటీవల సినిమా విడుదల విషయంలో అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. షూటింగ్ పెండ్డింగ్ ఉండటంతో పాటు గ్రాఫిక్స్ వర్క్ కి ఎక్కువ సమయం పట్టే అవకాశాలు ఉన్నాయి. కనుక వచ్చే ఏడాది సంక్రాంతికి సినిమా రాకపోవచ్చు అనే అభిప్రాయాన్ని కొందరు వ్యక్తం చేస్తున్నారు. కానీ ఇప్పటి వరకు యూనిట్ సభ్యులు మాత్రం సినిమా ఆలస్యం అవుతుంది అనే విషయాన్ని ధృవీకరించలేదు. సంక్రాంతికి తీసుకు వచ్చే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని సమాచారం అందుతోంది.

# అందాలతో మతి పోగొడుతున్న అదితి...!

చూడగానే ఆకట్టుకునే అందం అదితి సొంతం. దక్షిణాదితో పాటు, ఉత్తరాదిన కూడా సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటోంది. తెలుగులో సమ్మోహనం మూవీతో ప్రేక్షకులను కూడా తన అందంతో సమ్మోహనపరిచింది. ఇంద్ర గంటి మోహన కృష్ణ దర్శకత్వం వహించిన ఈ సినిమా బాగానే క్లిక్ అయ్యింది. అయితే, అప్పటి నుంచి స్టార్ హీరోయిన్ గా ఎదగకపోయినా, వరసగా అవకాశాలు మాత్రం అందుకుంటూ ముందుకు సాగుతోంది. ఇటీవల బాలీవుడ్ లో ఢిల్లీ 6 అనే సినిమాలో నటించింది. ఈ సినిమా కూడా బాగానే క్లిక్ అయ్యింది. దీంతో, ఆమెకు వరసగా బాలీవుడ్ లో ఆఫర్లు క్యూ



కడుతున్నాయి. తన కెరీర్ ని మాత్రం మళయాళంలో మొదలుపెట్టింది. ఆ తర్వాత అక్కడి నుంచి తమిళంలోకి, ఆ తర్వాత తెలుగులోకి అడుగుపెట్టి, అదరగొట్టింది. అదితి సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా కూడా కొన్ని ఫోటోలు షేర్ చేసింది. ఆ ఫోటోల్లో అదితి చాలా అందంగా కనపడుతోంది. ఫ్లోరల్ గౌను ధరించింది. అయితే, అందులో ఆ గౌను స్లీవ్ లెస్ కావడంతో ఆమెఎద అందాలు స్పష్టంగా కనపడుతున్నాయి. ఎవరి గురించి తీక్షణంగా ఎదురు చూస్తున్నట్లుగా ఆ ఫోటోకి ఆమె ఫోజు ఇవ్వడం విశేషం. ఈ ఫోటోలు ప్రస్తుతం వైరల్ గా మారాయి. నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. ఇదిలా ఉండగా, అదితి గత కొంత కాలంగా హీరో సిద్ధార్థ్ తో ప్రేమలో పడింది అంటూ వార్తలు వస్తున్నాయి.

వీరిద్దరూ కలిసి షికార్లు చేస్తూ, ట్రిప్ లకు వెళ్తున్న ఫోటోలు వైరల్ అవ్వడంతో,వీరు ప్రేమలో ఉన్నారని అర్థమైంది. అయితే, ఇప్పటి వరకు వీరిద్దరూ అయితే, దీనిపై క్లారిటీ ఇవ్వలేదు. ప్రస్తుతానికి అయితే, వీరు లివ్ ఇన్ రిలేషన్ లో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక, సిద్ధార్థ్, అదితి లు మహాసముద్రం సినిమాలో కలిసి నటించారు. అప్పుడు ఏర్పడిన పరిచయమే ప్రేమగా మారినట్లు సమాచారం. ఆ మూవీలో సిద్ధార్థ తో పాటు, శర్వానంద్ కూడా నటించారు.

## గ్లామర్ ఒలకబోస్తున్న హుషారు బ్యూటీ.. కెవ్వు కేక

స్టార్ హీరోయిన్ గా సెట్ అయ్యే అన్ని లక్షణాలు ఉన్న బ్యూటీ దక్ష నగార్కర్. తొలిసారి హెూరాహెూరీ అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది. కానీ, ఆ సినిమా గురించి కూడా ఎవరికీ తెలియకపోవడంతో దక్షకు పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ, ఆ తర్వాత హుషారు అనే మూవీతో మరోసారి ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ మూవీ క్లిక్ అయినా, దక్షకు పెద్దగా ఛాన్సులు రాలేదనే చెప్పాలి. జాంబిరెడ్డి, బంగార్రాజు వంటి చిత్రాలు హిట్ అయినా, దక్ష కెరీర్ కి ఉపయోగపడేలేదు. రవితేజ రావణాసురలో అవకాశం వచ్చింది కానీ, ఆ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఆ తర్వాత ఆమెకు మళ్లీ ఆఫర్లు రాలేదు. కానీ, ఈ బ్యూటీ సోషల్ మీడియాలో మాత్రం రచ్చ చేయడంలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సోషల్ మీడియాలో తన



ఫోటోలు షేర్ చేసి ఆకట్టుకుంటూ ఉంటుంది. కాగా, తాజాగా పింక్ కలర్ డ్రెస్ లో హాట్ గా కనిపించింది. పింక్ ప్యాంట్, పింక్ టాప్, మధ్యలో వైట్ కలర్ టీషర్ట్ ధరించింది. అయితే, టాప్ లో తన ముందుర అందాలు క్లియర్ గా కనిపించేలా కెమేరాకి ఫోజులు ఇవ్వడం విశేషం. ఈ ఫోటోలు చూసి కుర్రాళ్లు పిచ్చెక్కిపోతున్నారు. అన్ని అందాలను ఎలా మోస్తున్నావు అంటూ కొంటెగా కామెంట్స్ చేస్తున్నారు. దక్ష సినిమాల కంటే, బంగర్రాజు ఈవెంట్ లో నాగచైతన్యను చూసి కన్ను కొట్టడంతో ఎక్కువ క్రేజ్ తెచ్చుకుంది. ఆ వీడియో ఫుల్ పాపులర్ అయ్యింది. దీంతో, చైతూకీ, దక్ష కి సమ్ థింగ్, సమ్ థింగ్ ఉంది అంటూ వార్తలు కూడా వచ్చాయి. అయితే, వాటిని ఆమె తిరస్కరించడం విశేషం. అంతేకాకుండా నాగచైతన్య క్యారెక్టర్ చాలా గొప్పదని, సినిమా షూటింగ్ లో భాగంగా ముట్టుకున్నా, ముద్దుపెట్టుకున్నా కూడా సారీ చెబుతాడు అని చెప్పింది. ఇక దక్ష విషయానికి వస్తే, చాలా అందంగా ఉంటుంది. ఎక్స్ పోజింగ్ చేయడంలోనూ ఎలాంటి మొహమాటం చూపించదు. మరి ఆమె అందాన్ని గుర్తించి ఛాన్సులు ఇస్తే, కచ్చితంగా మంచి నటిగా ప్రూవ్ చేసుకోగలదు.




హైదరాబాద్: పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు లభించడంపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల రైతులకు అభినందనలు తెలిపారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టుదలకు ఫలితం వచ్చిందన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు యుద్ధప్రాతిపదికన పూర్తవుతుందని పేర్కొన్నారు. మరోవైపు, సీఎం కేసీఆర్‌ను భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ లోక్‌సభలో అసభ్యకరంగా దూషించారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ప్రధాని ఇంటి పేరు అవమానించారని కాంగ్రెస్ ఎంపీ సభ్యత్వాన్ని రద్దు చేశారు. కేసీఆర్‌ను దూషించిన బండి సంజయ్‌ను మేమేం చేయాలి?ఇప్పుడు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ఏం చేస్తారు?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

## కాంగ్రెస్‌కు క్యాండిడేట్లు లేరు..బీజేపీకి బలం లేదు : మంత్రి హరీశ్ రావు



సిద్దిపేట : కాంగ్రెక్‌కు గతమే తప్పా భవిష్యత్తు లేదు. కేంద్రం ప్రభుత్వంపై అవిశ్వాసం పెట్టి దారుణంగా విఫలమైంది అసెంబ్లీలోనూ కాంగ్రెస్ తీరు ఎంత దారుణంగా ఉందో చూశామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గంలో వివిధ పార్టీల నుంచి మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గజ్వేల్‌లో కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా రాదు. కాంగ్రెస్‌లో వాల్ల గొడవలు వాళ్లకే తప్ప ప్రజల బాధలు పట్టవని మండిపడ్డారు. బీజేపీ బలం లేదు. కాంగ్రెస్‌కు కాండిడేట్లు లేరు..బీఆర్ఎస్‌కు తిరుగులేదన్నారు. ఎవరు ఔనన్నా, కాదన్నా బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఒకప్పుడు ఆంధ్రలో ఎకరం భూమి అమ్ముకుంటే తెలంగాణలో ఐదు ఎకరాలు దొరికేది, నేడు తెలంగాణలో ఎకరం అమ్మితే ఆంధ్రలో ఐదు ఎకరాలు దొరికే పరిస్థితి వచ్చిందని చంద్రబాబు అంటున్నారు. ఇది బీఆర్ఎస్ పాలనకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో కేసీఆర్ పాలన అంతం చేస్తాం



ఢిల్లీ: తెలంగాణలో కేసీఆర్ కుటుంబ పాలన అంతం చేయడానికి బీజేపీ మాత్రమే ఏకైక ప్రత్యామ్నాయం అని ఆ పార్టీ ఎంపీ లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. "అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ సమయంలో విపక్షాలు సభలో లేవు. మరి అలాంటప్పుడు అవిశ్వాసం పెట్టడం దేనికి?, కాంగ్రెస్ తోక పార్టీలుగా బీఆర్ఎస్, మజ్లిస్ కూడా వాక్ ఔట్ చేయడం చూశాం. అవిశ్వాస తీర్మానం పెట్టి చివరి వరకు లేకుండా పారిపోవడం చరిత్రలో బహుశా ఇదే మొదటిసారి. పార్లమెంటు సాక్షిగా ప్రతిపక్షాలు బొక్క బోర్ల పడ్డాయి. అభాసుపాలయ్యాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి ఆడుతున్న నాటకం ఢిల్లీలో బహిర్గతమైంది. బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు, ప్రత్యామ్నాయంగా అభివృద్ధి ఎజెండాను ప్రజల ముందు ఉంచుతాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు రుణాలు అందజేసింది కేంద్ర ప్రభుత్వ సంస్థలు కాదా? ఇదే విషయాన్ని చెబితే ఎందుకు రాద్ధాంతం చేస్తున్నారు?, కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను ఇప్పటిదాకా నిర్మించి పేదలకు ఇవ్వలేకపోయిన బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారు. పార్లమెంటు సభ్యుడిగా తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి బండి సంజయ్ మాట్లాడారు." అని లక్ష్మణ్ పేర్కొన్నారు.




ఢిల్లీ: అవిశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా లోక్‌సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడిన తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. ఓవైపు నెలల తరబడి ఈశాన్య రాష్ట్రం మణిపూర్ అల్లర్లతో మండుతుంటే.. ప్రధాని మాత్రం పార్లమెంట్‌లో నవ్వుతూ, జోకులు వేశారని దుయ్యబట్టారు. ఆయన మాట్లాడిన తీరు తీవ్ర విచారకరమన్నారు. "ప్రధాని మోదీ నిన్న లోక్‌సభలో 2 గంటల 13 నిమిషాల పాటు సుదీర్ఘ ప్రసంగం చేశారు. కానీ, మణిపూర్ గురించి కేవలం 2 నిమిషాలు మాత్రమే ప్రస్తావించారు. గత కొన్ని నెలలుగా మణిపూర్‌లో ఏం జరుగుతోందో ప్రధాని మర్చిపోయినట్లున్నారు. ఓవైపు అల్లర్లు, అత్యాచారాలు, హత్యలతో మణిపూర్ అట్టుడుకుతోంటే.. ప్రధాని పార్లమెంట్‌లో నవ్వుతూ, జోకులు వేశారు. విపక్షాలను విమర్శిస్తూ నినాదాలు చేశారు. గతంలో ఎందరో ప్రధానులను చూశాను. కానీ, ఇలా స్థాయి దిగజారి మాట్లాడిన ప్రధానిని నేను చూడలేదు. ప్రధాని పదవిని చేపట్టిన వ్యక్తి.. దేశ ప్రజలందరికీ ప్రతినిధిగా ఉంటారు. ఆయన ఓ రాజకీయ నాయకుడిగా మాట్లాడకూడదు" అని రాహుల్ ధ్వజమెత్తారు. "ఇక్కడ సమస్య కాంగ్రెస్సో, నేనో కాదు. 2024లో మోదీ మళ్లీ ప్రధానమంత్రి అవుతారా? లేదా? అన్నది కూడా కాదు. మణిపూర్‌లో ఏం జరుగుతోంది? దాన్ని ఎందుకు ఆపలేకపోతున్నాం? అనేదే ప్రధాన సమస్య. దీన్ని పరిష్కరించేందుకు ప్రధాని చేతుల్లో చాలా అవకాశాలున్నాయి. కానీ, వాటిని ఆయన వినియోగించట్లేదు. ఆర్మీని రంగంలోకి దింపితే రెండు, మూడు రోజుల్లో శాంతిని నెలకొల్పేందుకు అవకాశం ఉంటుంది. కానీ ప్రధాని ఆ నిర్ణయం తీసుకోవట్లేదు. మణిపూర్ మండుతూనే ఉండాలని, దాన్ని ఆర్పకూడదని ఆయన భావిస్తున్నారు" అని రాహుల్ మండిపడ్డారు. ఈ సందర్భంగా అవిశ్వాస తీర్మానంపై చర్చ సమయంలో తాను చేసిన ప్రసంగంలోని కొన్ని వాక్యాలను రికార్డుల నుంచి తొలగించడంపై రాహుల్ స్పందించారు. 'భరతమాత' అనే పదాలను పార్లమెంట్ రికార్డుల నుంచి తొలగించడం అవమానకరమని ఆక్షేపించారు. "నేనేం ఆధారాల్లేకుండా అలా మాట్లాడలేదు. మణిపూర్‌లో పరిస్థితులు అలాగే ఉన్నాయి. ఇరు వర్గాల మధ్య చర్చలే లేవు. కేవలం హింస మాత్రమే చెలరేగుతుంది" అని రాహుల్ తెలిపారు. తమ డిమాండ్ ఒక్కటేనని, ప్రధాని మోదీ కనీసం ఒక్కసారైనా మణిపూర్‌కు వెళ్లి ఇరు వర్గాలతో మాట్లాడాలని ఆయన మరోసారి స్పష్టం చేశారు.

## నో డౌట్.. మళ్లీ కొత్తగూడెం నుంచే పోటీ చేస్తా..

కొత్తగూడెం : సుప్రీం స్టేతో న్యాయమే గెలిచిందని, దేవుడి ఆశీర్వాదం, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అండదండలు, కార్యకర్తలు, అభిమానుల మద్దతుతో తనకు అంతా మంచే జరుగుతుందని కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. వనమా ఎన్నిక చెల్లదంటూ ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయన సుప్రీం కోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు తీర్పుపై స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ స్టే వచ్చిన తర్వాత తొలిసారి కొత్తగూడెం వచ్చిన వనమాకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు సుజాతనగర్ సమీపంలోని నాయకులగూడెం వద్ద ఘన స్వాగతం పలికారు. డప్పువాయిద్యాలు, బంజారా నృత్యాలు, కోలాటాలు, కళాకారుల ఆటపాట మధ్య నాయకులగూడెం నుంచి సుజాతనగర్, హౌసింగ్‌బోర్డుకాలనీ, విద్యానగర్‌కాలనీ, చుంచుపల్లి, కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరు, బస్టాండ్‌సెంటరు, కొత్తగూడెం పట్టణం సూపర్‌బజారు, ఎంజీ రోడ్డు, గణేష్ టెంపుల్, మొర్రేడుబ్రిడ్జి మీదుగా పాత పాల్వంచ వరకు సుమారు 30 కిలోమీటర్లు వందలాది ద్విచక్రవాహనాలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ క్రమంలో పోస్టాఫీస్ సెంటరు, విద్యానగర్‌కాలనీల వద్ద రెండు క్రేన్ల సాయంతో వనమాకు గజమాలలను అలంకరించారు. అంతకుముందు వనమా జూలూరుపాడులోని సాయిబాబా ఆలయం, నాయకులగూడెం వద్ద ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటరులో ప్రజలను ఉద్దేశించి వనమా మాట్లాడుతూ కేసీఆర్ ఆశీస్సులతో వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధిస్తానని, తుదిశ్వాస వరకు కొత్తగూడెం ప్రజలకు సేవచేస్తానని, ఎన్నో కుట్రలు, కుత్రంతాలు దాటుకుని 40ఏళ్లుగా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగిస్తున్నానని, ఇదంతా నియోజకవర్గ ప్రజల ఆశ్వీరాదంతోనే జరిగిందన్నారు. తాను మళ్లీ నేటినుంచే కార్యాచరణలో ఉంటానని నియోజకవర్గ అభివృద్ధికి ఎన్ని నిధులు కావాలన్న ఇచ్చేందుకు సిద్ధమని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో భద్రాద్రి జడ్పీ వైస్‌చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, కొత్తగూడెం మున్సిపల్‌చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్‌చైర్మన్ వేల్పుల దామోదర్, నాయకులు ఎం.ఎ. రజాక్, పలువురు కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, పార్టీశ్రేణులు, మహిళలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.




దిల్లీ: రోగులు, వారి బంధువులు వైద్యులపై దాడులు చేస్తున్న ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో గతంలో నేషనల్ మెడికల్ కమిషన్ రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టిషనర్స్ నియమావళి పేరుతో రూపొందించిన నిబంధనలను అమల్లోకి తీసుకొస్తున్నట్లు ఎన్ఎంసీ తెలిపింది. దీంతో ఇకపై వైద్యులతో అనుచితంగా ప్రవర్తించే రోగులకు చికిత్స నిరాకరించవచ్చని వెల్లడించింది. వైద్యులపై హింసను అరికట్టడమే లక్ష్యంగా ఈ నిబంధనలు అమల్లోకి తీసుకొస్తున్నట్లు ఎన్ఎంసీఆర్ఎంపీ పేర్కొంది. ఇకపై కోడ్ ఆఫ్ మెడికల్ ఎథిక్స్ 2002 స్థానంలో కొత్తగా తీసుకొచ్చిన ఎన్ఎంసీఆర్ఎంపీ రెగ్యులేషన్ 2023 అమల్లోకి రానుంది. రోగికి అందించే వైద్యం, ఫీజుకు సంబంధించిన వివరాలను తెలియజేసే బాధ్యత వైద్యులదే. చికిత్స ప్రారంభించే ముందే రోగికి కన్సల్టేషన్/చికిత్స ఫీజు గురించి తప్పక తెలియజేయాలని ఎన్ఎంసీఆర్ఎంపీ నిబంధనల్లో పేర్కొంది. ముందుగా చెప్పిన ప్రకారం ఫీజు చెల్లించకుంటే వైద్యుడు చికిత్స నిరాకరించొచ్చు. అయితే, అత్యవసర సేవల విషయంలో మాత్రం ఈ నిబంధన వర్తించదని తెలిపింది. ఒకవేళ రోగి లేదా వారి బంధువులు దురుసుగా, హింసాత్మకంగా వ్యవహరిస్తే.. వారి ప్రవర్తన గురించి రికార్డులో రాసి.. వేరేచోట తదుపరి చికిత్స చేయించుకునేలా వైద్యులు వారికి సూచించాలని తెలిపింది. ప్రాణాపాయ పరిస్థితులు మినహా వైద్యులు ఎవరికి చికిత్స అందించాలనేది పూర్తిగా వారి స్వీయ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని పేర్కొంది. రోగికి వైద్యం ప్రారంభించిన తర్వాత, వారి బంధువులకు సమాచారం అందించకుండా వైద్యుడు రోగికి చికిత్స నిరాకరించకూడదని ఎన్ఎంసీఆర్ఎంపీ తెలిపింది.

ఒకవేళ ప్రస్తుతం చికిత్స చేస్తున్న వైద్యుడితోపాటు అదనంగా మరో వైద్యుడు అవసరం ఉంటే దాని గురించి రోగి లేదా అతని కుటుంబసభ్యులకు తప్పనిసరిగా సమాచారం అందించాలని స్పష్టం చేసింది. ఫార్మా సంస్థల నుంచి వైద్యులు అదనంగా ఎలాంటి బహుమతులు, ప్రయాణ సౌకర్యాలు పొందకూడదని నిబంధనల్లో పేర్కొంది. అలాగే, ఫార్మా సంస్థలు నిర్వహించే విద్యాసంస్థల్లో జరిగే వర్క్‌షాప్‌లు, సెమినార్‌ల్లో వైద్యులు పాల్గొనకూడదని తెలిపింది.




దిల్లీ: మణిపూర్ అంశంపై ప్రధాని నరేంద్రమోదీకి అమెరికాకు చెందిన ప్రముఖ సింగర్ మేరీ మిల్బెన్ నుంచి మద్దతు లభించింది. ఆయన ఈశాన్యరాష్ట్ర ప్రజల కోసం నిత్యం పోరాడుతుంటారని వ్యాఖ్యానించారు. అవిశ్వాస తీర్మానంపై జరిగిన చర్చలో భాగంగా చివరగా గురువారం ప్రధాని మాట్లాడారు. అది ముగిసిన కొద్దిసేపటికే మిల్బెన్ నుంచి ఈ వ్యాఖ్యలు వెలువడ్డాయి. 'నిజం ఏమిటంటే.. భారత ప్రజలకు తమ నేతపైన విశ్వాసం ఉంది. మణిపూర్, భారత్‌కు చెందిన మహిళలు, కుమార్తెలకు న్యాయం అందుతుంది. ప్రధాని మోదీ ఎప్పుడూ మీ స్వేచ్ఛ కోసమే పోరాడుతుంటారు. విపక్షాలు ఎలాంటి విషయం లేకుండా రాద్ధాంతం చేస్తుంటాయి. విదేశాల్లో తన దేశాన్ని అగౌరవపరచడం నాయకత్వం కాదు. కానీ నిజం ఎల్లప్పుడూ ప్రజలు స్వేచ్ఛగా ఉండేలా చూస్తుంది' అని మిల్బెన్ తన ట్విటర్ ఖాతాలో రాసుకొచ్చారు. అలాగే తనకు ప్రధాని మోదీపై విశ్వాసం ఉందని, ఆయన కోసం ప్రార్థిస్తానన్నారు. స్వేచ్ఛ గురించి ప్రముఖ ఆఫ్రికన్-అమెరికన్ పౌరహక్కుల ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ చేసిన కోట్‌ను ప్రస్తావించారు. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో భాగంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో మేరీ మిల్బెన్ భారత జాతీయ గీతం 'జనగణమన' ఆలపించారు. భారత ప్రధాని కోసం జాతీయ గీతాన్ని ఆలపించడం ఎంతో గౌరవంగా ఉందని అప్పుడు మిల్బెన్ సంతోషం వ్యక్తం చేశారు. ఆ సందర్భంలో ఆమె మోదీ పాదాలను తాకి ఆశీర్వాదం తీసుకున్నారు. ప్రముఖ ఆఫ్రికన్ - అమెరికన్ హాలీవుడ్ నటి, గాయని అయిన మిల్బెన్ గతంలో భారత జాతీయ గీతం 'జనగణమన', 'ఓం జై జగదీశ్ హరే' పాడి భారతీయులకు సుపరిచితురాలయ్యారు. నిన్న అవిశ్వాస తీర్మానంలో భాగంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈశాన్య రాష్ట్రాలను తాము కాంగ్రెస్ మాదిరిగా ఓట్లతో తులాభారం వేయకుండా మనస్ఫూర్తిగా అభివృద్ధి చేస్తున్నామని, ఆ ప్రాంతం తమ మానస పుత్రిక అని అభివర్ణించారు. గత 9 ఏళ్లలో అక్కడ రూ.లక్షల కోట్లు ఖర్చుపెట్టినట్లు వివరించారు.

## సందర్శకుల సౌకర్యార్థమే ఆల్పాహారం ఏర్పాటు : మంత్రి ఎర్రబెల్లి



హనుమకొండ, ఆగస్టు 11 : వివిధ పనుల కోసం తనను కలిసేందుకు వచ్చే సందర్శకుల సౌకర్యార్థం ఆల్పాహారం ఏర్పాటు చేస్తున్నట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. హనుమకొండ ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మంత్రి వివిధ పనుల మీద పాలకుర్తి నియోజకవర్గం సహా పలు ప్రాంతాల నుంచి వచ్చే సందర్శకుల కోసం శుక్రవారం ఆల్పాహారాన్ని స్వయంగా వడ్డించి, ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పాలకుర్తి నియోజకవర్గం నుంచే గాక, వివిధ పనులపై అనేక మంది తన వద్దకు వస్తున్నారని, వాళ్లందరికి ఇబ్బందులు ఉండకూడదన్న ఉద్దేశంతోనే ఆల్పాహారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి నుంచి తన వద్దకు వచ్చే వాళ్లకు ఆల్పాహారం, మధ్యాహ్న భోజనం ఉంటుందన్నారు. అయితే, ఇందుకు భిన్నంగా పెద్ద మొత్తంలో సందర్శకుల కోసం ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నామన్నారు. తాను అందుబాటులో ఉండే, హైదరాబాద్ మంత్రుల నివాసం, హనుమకొండలోని ఆర్అండ్ బీ అతిథి గృహం, పాలకుర్తి క్యాంపు కార్యాలయం, పర్వతగిరిలోని తమ ఇంటి వద్ద ఈ సదుపాయం ఉంటుందని, ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

## పాలమూరు-రంగారెడ్డిని పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం: మంత్రి శ్రీనివాస్ గౌడ్



హైదరాబాద్: ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా సీఎం కేసీఆర్ కృషితో విజయం సాదించామని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఇది పాలమూరు జిల్లా ప్రజల విజయమని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తిచేసి జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్నారు. ఇటికే జిల్లాకు ఇతర రాష్ట్రాల నుంచి వలసలు వస్తున్నారని వెల్లడించారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలని కేంద్ర ప్రభుత్వానికి లేదని, అందుకే నిధులు, అనుమతులు ఇవ్వకుండా ఇబ్బందులు సృష్టించిందన్నారు. చివరికి న్యాయమే గెలిచిందని చెప్పారు. రాష్ట్రం విడిపోయి తొమ్మిదేండ్లు గడుస్తున్నప్పటికీ కృష్ణ జలాల్లో నీటి వాటా తేల్చడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, మన పాలమూరుకు మాత్రం ఇవ్వడంలేదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర పుట్టుకనే ప్రధాని మోదీ సర్కార్ అవమానించిందని నిప్పులు చెరిగారు. ఈ జిల్లాకు చెందిన నాయకులు కేసులు వేశారని అన్నారు. మన నీళ్లు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తుంటే మంగళహారతులు పెట్టిన నాయకులు ఈ జిల్లాలోనే ఉన్నారని తెలిపారు. పాలమూరు జిల్లాపై సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకమైన ప్రేమాభిమానాలు ఉన్నాయని చెప్పారు. ఈ జిల్లా నుంచి ఎంపీగా ఉన్న సమయంలో ఇక్కడి ప్రజల కష్టాలు చూసిన కేసీఆర్.. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టారని.. కేసులు లేకుంటే కాళేశ్వరం కంటే ముందే పాలమూరు పూర్తయ్యేదన్నారు.

## క్రీడలకు దూరంగా ఉండటం వల్లే విద్యార్థుల్లో ఆత్మహత్యలు : మంత్రి జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : ప్రస్తుత సమాజంలో చిన్నారులకు కావాల్సిన అసలైన విద్య క్రీడలతోనే లభిస్తుందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. చిన్నారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచడమే లక్ష్యంగా సూర్యాపేట క్యాంపు కార్యాలయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు క్రీడా సామగ్రి పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి.. జిల్లాలో ఉన్న 155 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్ లకు క్రీడ సామగ్రితో కూడిన కిట్ల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవితాన్ని చదవడంలో క్రీడలదే ప్రముఖ పాత్ర అన్నారు. చిన్న,చిన్న కారణాలకు పిల్లలు ఇటీవల కాలంలో అఘాయిత్యాలకు పాల్పడటానికి కారణం తరగతి గది, హాస్టల్ గదికి పరిమితమవుతూ క్రీడలకు దూరంగా ఉండటం, క్రీడా స్ఫూర్తి కొరవడటమే పిల్లల అఘాయిత్యాలకు కారణం అన్నారు.
ప్రస్తుత ఆధునిక యుగంలో సెల్,టీవీలకే పరిమితమవుతుండటంతో చిన్న, చిన్న కారణాలకు ఒత్తిడికి గురవుతున్న పిల్లలను బయట పడేయటంలో క్రీడలదే ప్రధాన పాత్ర అన్నారు. క్రీడలలో గెలుపు, ఓటముల ద్వారా వచ్చే అనుభవాలు జీవితంలో వచ్చే ఆటు, పోటులను తట్టుకోవడానికి ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఇటీవల తాను సూర్యాపేట నియోజక వర్గంలో నిర్వహించిన క్రీడల్లో సైతం వేలాదిగా ప్రజలు పాల్గొనడం, అందునా, మహిళలు 27 వేల మంది పాల్గొనడం నాకు ఎక్కువ ఆనందాన్ని ఇచ్చిందని చెప్పారు. 50 ఏండ్ల వయసులో సైతం మహిళలు కబడ్డీ ఆడటం మంచి విషయమన్నారు. పిల్లలకు ఉపయోగపడే ఏ కార్యక్రమంలో అయినా నా భాగస్వామ్యం ఉంటుందన్న మంత్రి, క్రీడలతో కూడిన పరిపూర్ణ విద్యకు కేరాఫ్ గా ను ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది సూర్యాపేట జిల్లాను క్రీడా హబ్‌గా తీర్చి దిద్దాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, డీఈవో తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com